JORDAR NEWS
విన్న అవినీతి అంతం - అదే మా పంతం
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాల్లో జోర్దార్ దినపత్రికలో పనిచేయుటకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
9848811424

RNI NO.TGTEL/25/A5224
# జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

JORDAR NEWS
విన్న అవినీతి అంతం - అదే మా పంతం
తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాల్లో జోర్దార్ దినపత్రికలో పనిచేయుటకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
9848811424

కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 269 శుక్రవారం, అక్టోబర్ 16 2026 , పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

## రైతుల బకాయిలపై ఎనుమాముల మార్కెట్‌ను

# చుట్టుముట్టిన ఆరోపణలు

■ రూ.80 కోట్ల లెక్క తేల్చాలంటున్న రైతు సంఘం..

**మాజీ జేడీఎం ఆస్తులపై దర్యాప్తు కోరుతూ ఫిర్యాదు**




**వరంగల్ జోర్దార్ నిఘా విభాగం**

రైతులకు దక్కాల్సిన కోట్లాది రూపాయల బకాయిల వ్యవహారం వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. రైతులకు చెల్లించాల్సిన వివిధ రకాల ఛార్జీలు, పత్తి కొనుగోళ్లకు సంబంధించిన మొత్తాలు కలిపి సుమారు రూ.80 కోట్ల మేర నష్టం వాటిల్లిందని తెలంగాణ రైతు సంఘం ఆరోపించింది. ఈ వ్యవహారంలో అసలు వాస్తవాలను వెలికితీసేందుకు సమగ్ర ఆర్థిక, పరిపాలనా విచారణ చేపట్టాలని డిమాండ్ చేసింది.ఈ మేరకు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్‌రావు ఆధ్వర్యంలో ప్రతినిధులు హైదరాబాద్‌లోని తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ కార్యాలయానికి వెళ్లి కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. రైతులకు రావాల్సిన బకాయిలు ఎందుకు చెల్లించలేదు? ఆ మొత్తాలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండటానికి కారణాలేమిటి? దీనివల్ల ఎవరికి ప్రయోజనం కలిగింది? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

**గన్నీ సంచుల ఛార్జీలపై ఆరోపణలు**

మార్కెట్‌లో రైతులు పత్తిని విక్రయించే సమయంలో ఉపయోగించే గన్నీ సంచులకు సంబంధించి వ్యాపారులు చెల్లించాల్సిన ఛార్జీల విషయంలో భారీగా బకాయిలు పేరుకుపోయాయని రైతు సంఘం పేర్కొంది. 2012 నుంచి 2023 ఏప్రిల్ వరకు ఈ బకాయిల మొత్తం సుమారు రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు ఉంటుందని ఆరోపించింది.రైతులకు సంబంధించిన ఈ మొత్తాలు నిర్ణీత విధంగా చెల్లించకుండా పెండింగ్‌లో ఉంచడం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోయారని సంఘం నాయకులు పేర్కొన్నారు. బకాయిలకు సంబంధించిన రికార్డులు, మార్కెట్ లావాదేవీలు, వ్యాపారుల చెల్లింపుల వివరాలను పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి బయటపడుతుందని అన్నారు.

**దడవాయి ఛార్జీలపైనా ప్రశ్నలు**

గన్నీ సంచుల ఛార్జీలతో పాటు దడవాయి ఛార్జీలకు సంబంధించిన సుమారు రూ.10 కోట్ల మేర మొత్తం కూడా రైతులకు అందలేదని రైతు సంఘం ఆరోపించింది. రైతుల నుంచి మార్కెట్ ద్వారా జరిగే లావాదేవీల్లో వసూలయ్యే వివిధ రకాల రుసుములు చివరకు రైతులకు చేరాల్సి ఉండగా, వాటి చెల్లింపుల్లో జాప్యం ఎందుకు జరిగిందనే విషయాన్ని తేల్చాలని కోరింది. ఈ మొత్తం వ్యవహారంలో మార్కెట్ అధికారులు, వ్యాపారులు, సంబంధిత ఇతర వర్గాల పాత్రను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందని సంఘం అభిప్రాయపడింది.

**పత్తి కొనుగోళ్లకు సంబంధించిన బకాయిలు**

భారత పత్తి సంస్థ కొనుగోలు చేసిన పత్తికి సంబంధించి కూడా రైతులకు రావాల్సిన మొత్తాల్లో అవకతవకలు జరిగాయని సంఘం ఆరోపించింది. 2012--13, 2014--15 సంవత్సరాల్లో కొనుగోలు చేసిన సుమారు 31.94 లక్షల గన్నీలకు సంబంధించి దాదాపు రూ.8 కోట్ల వరకు రైతులకు నష్టం వాటిల్లిందని పేర్కొంది.గన్నీ సంచుల ఛార్జీలు, దడవాయి ఛార్జీలు, పత్తి కొనుగోళ్లకు సంబంధించిన మొత్తాలను కలిపి చూస్తే రైతులకు జరిగిన నష్టం సుమారు రూ.80 కోట్ల వరకు ఉంటుందని రైతు సంఘం చెబుతోంది. ఈ మొత్తం ఎలా లెక్కించబడింది, ఏ కాలానికి సంబంధించినది, ఎవరి వద్ద బకాయిలుగా ఉంది, ఇప్పటి వరకు ఎంత చెల్లించారు అనే వివరాలను అధికారికంగా వెల్లడించాలని డిమాండ్ చేసింది.

**ఏళ్లుగా మూతపడిన గోదాములు**

మార్కెట్‌లోని మూడు గోదాములకు సంబంధించిన వ్యవహారం కూడా వివాదాస్పదంగా మారిందని రైతు సంఘం తెలిపింది. గన్నీ సంచుల బకాయిలకు సంబంధించిన న్యాయపరమైన వ్యవహారాన్ని కారణంగా చూపుతూ గోదాములను సుమారు 13 ఏళ్లుగా తాళాలు వేసి ఉంచారని ఆరోపించింది.
దీంతో మార్కెట్ కమిటీకి రావాల్సిన అద్దె ఆదాయం కోల్పోయిందని, ఇప్పటి వరకు సుమారు రూ.2 కోట్ల మేర ఆదాయ నష్టం వాటిల్లినట్లు పేర్కొంది. గోదాములను ఎందుకు వినియోగంలోకి తీసుకురాలేదు? వాటిపై ఉన్న వివాదం ఏమిటి? మార్కెట్ కమిటీకి జరిగిన ఆర్థిక నష్టానికి బాధ్యత ఎవరిది? అనే అంశాలను కూడా విచారణలో తేల్చాలని కోరింది.

**మాజీ జేడీఎం పాత్రపై విచారణకు డిమాండ్**

ఈ మొత్తం వ్యవహారంలో మాజీ జేడీఎం ఉప్పుల శ్రీనివాస్ పాత్రపై కూడా సమగ్ర విచారణ జరపాలని రైతు సంఘం డిమాండ్ చేసింది. 1996లో సీనియర్ మార్కెటింగ్ అధికారిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన ఆయన.. దాదాపు 30 ఏళ్ల సర్వీసులో మూడేళ్లు మినహా 27 ఏళ్లపాటు వరంగల్ రీజియన్ పరిధిలోనే పనిచేశారని చందర్‌రావు ఆరోపించారు.వరంగల్ మార్కెట్‌కు సంబంధించిన కీలక వ్యవహారాల్లో ఆయన ప్రభావం కొనసాగిందని పేర్కొన్న రైతు సంఘం.. ఆయన పదవీకాలంలో తీసుకున్న నిర్ణయాలు, రైతులకు సంబంధించిన బకాయిల చెల్లింపులు, మార్కెట్ లావాదేవీలు, వ్యాపారులతో జరిగిన వ్యవహారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరింది. అంతేకాకుండా మాజీ జేడీఎం ఆస్తుల వివరాలను పరిశీలించి, ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయా? ఆస్తుల సమీకరణకు సంబంధించిన ఆర్థిక వనరులు ఏమిటి? అనే అంశాలపై అవినీతి నిరోధక శాఖతో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది.పత్తి రైతులు, కౌలు రైతుల ధ్రువీకరణ ప్రక్రియపైనా రైతు సంఘం పలు ఆరోపణలు చేసింది. సంబంధిత అధికారులకు ఉన్న ధ్రువీకరణ అధికారాన్ని కొందరు ప్రైవేటు వ్యాపారులు దుర్వినియోగం చేసుకున్నారని, పర్సంటేజీల ప్రాతిపదికన బినామీ రైతులను ధ్రువీకరించినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొంది. ఈ ప్రక్రియలో వాస్తవంగా పంట పండించిన రైతులు ఎవరు? బినామీ పేర్లతో ధ్రువీకరణ పొందిన వారు ఎవరు? ధ్రువీకరణకు ఉపయోగించిన పత్రాలు ఏమిటి? అనే అంశాలను పరిశీలించాలని కోరింది. గత కొన్నేళ్లలో జారీ చేసిన రైతు ధ్రువీకరణలను పునఃపరిశీలిస్తే అక్రమాలు బయటపడే అవకాశం ఉందని సంఘం నాయకులు తెలిపారు.

**సమగ్ర దర్యాప్తు చేయాలి**

రైతులకు రావాల్సిన నిధుల విషయంలో జరిగినట్లు చెబుతున్న అవకతవకలపై కేవలం శాఖాపరమైన విచారణతో సరిపెట్టకుండా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని తెలంగాణ రైతు సంఘం కోరింది. మార్కెట్ రికార్డులు, బ్యాంకు లావాదేవీలు, వ్యాపారుల చెల్లింపులు, గోదాముల అద్దె వివరాలు, పత్తి కొనుగోళ్ల రికార్డులు, రైతుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించాలని డిమాండ్ చేసింది.రైతుల నష్టాన్ని లెక్కించి, వారికి రావాల్సిన మొత్తాలను తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరింది. బాధ్యులుగా తేలిన అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు అవసరమైతే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది.

**రైతు కమిషన్‌కు ఫిర్యాదు**

ఈ అంశాలపై రైతు సంఘం ప్రతినిధులు రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డిని కలిసి వివరంగా ఫిర్యాదు చేశారు. రైతులకు జరిగినట్లు ఆరోపిస్తున్న నష్టంపై విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరారు.ఫిర్యాదుపై సానుకూలంగా స్పందించిన చైర్మన్ కోదండరెడ్డి.. అంశాలను పరిశీలించి తగిన స్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకునేలా చూస్తామని హామీ ఇచ్చినట్లు రైతు సంఘం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు పానుగంటి నరసయ్య, నార్ల చంద్రశేఖర్, మాదం తిరుపతి పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో

# గెలుపే లక్ష్యం




**హనుమకొండ, అక్టోబర్ 15:**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతోందని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా మడికొండలో వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు యశస్విని రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి, కుడా చైర్‌పర్సన్ సుధారాణి, కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డితో పాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ఉమ్మడి జిల్లా డీసీసీ అధ్యక్షులు, పార్టీ కార్యకర్తలు హాజరయ్యారు. సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి విజయానికి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. చరిత్రలోనే ఇంత ముందుగా ఎమ్మెల్సీ అభ్యర్థిని ప్రకటించడం ఇదే తొలిసారని పేర్కొంటూ, దీని వెనుక కాంగ్రెస్ పార్టీ వ్యూహాన్ని అర్థం చేసుకోవాలని సూచించారు. పట్టభద్రులు తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా పార్టీ శ్రేణులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

## కాంగ్రెస్‌ది ప్రజా పాలన కాదు..

# పచ్చి దోపిడీ



**హైదరాబాద్, అక్టోబర్15:**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత మరోసారి మండిపడ్డారు. గురువారం బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ది ప్రజాపాలన కాదు.. పచ్చి దోపిడీ, లూటీ పాలన అంటూ అభివర్ణించారు. అనుచరులు, ఆప్తులకు ప్రయోజనం చేకూర్చేందుకు నిబంధనల ఉల్లంఘనలు అని విమర్శించారు. అర్హతలు లేని వారికి కమీషన్ల కోసం పనులు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ప్రజలకు, వ్యాపారులకు రక్షణ కల్పించాల్సిన ముఖ్యమంత్రి కార్యాలయంలోనే ఆగడాలు ఏమిటని ప్రభుత్వాన్ని ఆమె సూటిగా ప్రశ్నించారు.కమీషన్ల కోసం బెదిరింపులకు పాల్పడేవారిని వదిలిపెట్టబోమని కవిత హెచ్చరించారు. తెలంగాణలోనూ మహిళా రైతుల సాధికారత చట్టం తీసుకురావాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా రైతులకు, రైతు కూలీలకు చట్టపరమైన గుర్తింపు కల్పించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. మహిళా రైతులకు ప్రభుత్వ పథకాలు, సామాజిక భద్రత తదితర ప్రయోజనాలు అందించాలని రేవంత్ ప్రభుత్వానికి టీఆర్ఎస్ చీఫ్ కవిత స్పష్టం చేశారు.

## ప్రభుత్వ జీతంతో బతుకుతూ

# ప్రైవేటు భీమా వ్యాపారం

■ కమలాపూర్ మండల ఉపాధ్యాయునిపై తక్షణ చర్యలు తీసుకోవాలి

■ పాఠాలు మానేసి పత్రాల అమ్మకంలో నిమగ్నం

■ విద్యాశాఖ ఉదాసీనతపై సామాజికవేత్త మౌనిక ఆగ్రహం




**జోర్దార్ హనుమకొండ ప్రతినిధి:**

**1. ఫిర్యాదు నేపథ్యం:**

హనుమకొండ జిల్లా, కమలాపూర్ మండలంలో నరసింహారెడ్డి అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు తన విధులను విస్మరించి, వ్యక్తిగత భీమా వ్యాపారం నిర్వహిస్తున్నారని ఫిర్యాదు వచ్చింది. ప్రభుత్వం నుండి జీతం తీసుకుంటూ, ప్రైవేటు భీమా సంస్థలకు సలహాదారుగా పని చేస్తూ, తరగతి గదిలో బోధన కన్నా వ్యాపారానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆరోపణ.

**2. సామాజిక మాధ్యమాలలో దొరికిన ఆధారాలు:**

ఆ ఉపాధ్యాయుని పేరుతో సామాజిక మాధ్యమాలలో భీమా ప్రకటనలు వెలువడ్డాయి. ఆ ప్రకటనలలో జీవిత భీమా, ఆరోగ్య భీమా, వాహన భీమా వంటి సేవలు, భీమా సలహాదారు అనే హోదా, చరవాణి సంఖ్యలు, పత్రాల పునరుద్ధరణ, నష్టపరిహారంలో సహాయం చేస్తాననే హామీలు ఉన్నాయి. ఇవి స్పష్టంగా వ్యక్తిగత వాణిజ్య కార్యకలాపాలుగా కనిపిస్తున్నాయి.

**3. గతంలో ఫిర్యాదు వచ్చినా పట్టించుకోని అధికారులు:**

ఈ ఉపాధ్యాయునిపై ఇది మొదటి ఫిర్యాదు కాదు. గతంలో కూడా ఇదే అంశంపై ఫిర్యాదులు రాగా, అప్పటి మండల విద్యాధికారి రామకృష్ణ రాజు విచారణ జరిపారు. ఆ విచారణ నివేదిక అప్పటి జిల్లా విద్యాధికారి వాసంతి వద్ద పెండింగ్ లో ఉంది. అయినప్పటికీ నేటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో సదరు ఉపాధ్యాయుడు తన వైఖరిని మార్చుకోకుండా యథేచ్ఛగా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారని ఆరోపణ.

**4. నియమ నిబంధనలకు విరుద్ధం:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తన నియమావళి 1964 లోని 10 వ నియమం ప్రకారం, ఏ ప్రభుత్వ ఉద్యోగి ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వ్యక్తిగత వ్యాపారం చేయరాదు. 3 వ నియమం ప్రకారం విధుల పట్ల నిబద్ధతతో ఉండాలి. ఈ రెండు నియమాలను ఈ సంఘటనలో ఉల్లంఘించినట్లు స్పష్టంగా కనిపిస్తోంది.

**5. సామాజికవేత్తల డిమాండ్:**

ఈ అంశంపై సామాజికవేత్త మౌనిక తీవ్రంగా స్పందిస్తూ డిమాండ్ చేశారు. కమలాపూర్ మండల ఉపాధ్యాయుడు నరసింహారెడ్డి పాఠాలు చెప్పడం మానేసి భీమా వ్యాపారం చేస్తున్నారని, గతంలో మండల విద్యాధికారి రామకృష్ణ రాజు విచారణ జరిపినా, జిల్లా విద్యాధికారి వాసంతి వద్ద నివేదిక పెండింగ్ లో ఉందని, ఇది విద్యా శాఖ నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే విచారణ జరిపి సదరు ఉపాధ్యాయుడిని శాశ్వతంగా విధుల నుండి తొలగించాలని ప్రభుత్వాన్ని కోరారు....

**ఇంటిలిజెన్స్ విచారణ అవసరం**

ఇలా ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ బహిరంగంగా ప్రైవేట్ వ్యాపారాలు చేస్తున్న టీచర్ల సంఖ్య వందల్లో ఉండొచ్చని సామాజికవేత్తల అభిప్రాయం... ఇంటెలిజెన్స్ విభాగం వారి చేత పూర్తి వివరాలు సేకరించి అందరిపై కఠిన చర్యలు తీసుకొని ఈ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి పట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణను, విద్యా వ్యవస్థ పవిత్రతను కాపాడేందుకు అధికారులు నిష్పక్షపాత విచారణ జరిపి న్యాయం చేయాలని వారు కోరుతున్నారు

## విజయవాడలో జాతీయ సరస్ మేళా కార్యక్రమం

### - ప్రారంభించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**విజయవాడ:** విజయవాడలో జాతీయ సరస్ మేళా కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. అనంతరం సరస్ మేళాలో స్టాళ్లను పరిశీలించారు. స్టాల్‌లో చీర కొనుగోలు చేసి డిజిటల్ చెల్లింపులు చేశారు. ఉత్పత్తుల ప్రత్యేకతలపై డ్వాక్రా మహిళలను అడిగి తెలుసుకున్నారు. సహజ ఉత్పత్తులు, చేనేత వస్తువులు, హ్యాండీక్రాఫ్ట్స్?లను రాష్ట్రపతి వీక్షించారు.ఈ కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి శివరాజ్ సింగ్, రామ్మోహన్ పాల్గొన్నారు. మధ్యాహ్నం స్వయం సహాయ సంఘాల మహిళలతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కలిసి భోజనం చేయనున్నారు. అనంతరం రాష్ట్రపతి ఢిల్లీకి బయలుదేరనున్నారు. దీంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తుల ప్రదర్శనకు 650 స్టాళ్లను ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో తొలిసారిగా జాతీయ సరస్ మేళా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. 'స్వయం ఏపీ' బ్రాండ్ పేరుతో ఉత్పత్తులకు ప్రభుత్వం మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తుంది. నేటి నుంచి ఈనెల 31 వరకు 14 రోజులపాటు సరస్ మేళా కార్యక్రమం ఉంటుంది.

# దుర్గామాతను దర్శించుకున్న వొడితల ప్రణవ్



**జమ్మికుంట,(జోర్దార్ ప్రతినిధి)**జమ్మికుంట మండలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ వివిధ గ్రామాల్లోని దుర్గామాత మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి కృపాకటాక్షాలు నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ప్రణవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దుర్గామాత మండపాల కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, మహిళలు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పేదలకు అండగా నిలవడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



■ వొడితల ప్రణవ్

**జమ్మికుంట,(జోర్దార్ ప్రతినిధి)**కష్టకాలంలో పేదలకు అండగా నిలిచి భరోసా కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం మన ఊరు--మన కాంగ్రెస్--మన ప్రణవ్ కార్యక్రమంలో భాగంగా జమ్మికుంట మండలంలోని మాచనపల్లి, జగ్గయ్యపల్లి, కోరపల్లి, విలాసాగర్, నగురం, వావిలాల, నాగంపేట, శాయంపేట, మడిపల్లి గ్రామాల్లో పర్యటించి, రూ.8 లక్షల విలువైన 17 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు.
అనారోగ్యంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదలను సీఎంఆర్ఎఫ్ చెక్కుల ద్వారా ఆదుకుంటున్నామని, గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ప్రణవ్ తెలిపారు. కష్టకాలంలో అండగా నిలిచిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, ప్రణవ్‌కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, బ్లాక్ కాంగ్రెస్, సీనియర్ నాయకులు,బీసీ,ఎస్సీ, మైనారిటీ,యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటి వృథాను అరికట్టాలి



■ బీసీ జేఏసీ డిమాండ్

**హుజూరాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**హుజూరాబాద్ పట్టణంలో మిషన్ భగీరథ తాగునీరు వృథాగా రోడ్లపై ప్రవహిస్తూ మురుగు కాలువల్లో కలుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని బీసీ జేఏసీ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం విజయ డయాగ్నస్టిక్ కేంద్రం, కేరళ స్కూల్ పరిసర ప్రాంతాలతో పాటు పలు ప్రాంతాలను వారు పరిశీలించారు.
ఈ సందర్భంగా బీసీ జేఏసీ గౌరవ అధ్యక్షుడు చందుపట్ల జనార్ధన్, అధ్యక్షుడు సందేల వెంకన్న, ప్రధాన కార్యదర్శి ఇప్పకాయల సాగర్, ఉపాధ్యక్షులు మామునూరి ప్రవీణ్ కుమార్, కొలిపాక క్రాంతి కుమార్ మాట్లాడుతూ,వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో తాగునీటిని పొదుపుగా వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు. కొన్ని ప్రాంతాల్లో అవసరానికి మించి నీటి సరఫరా జరుగుతుండగా, మరికొన్ని ప్రాంతాల ప్రజలు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మున్సిపల్ కౌన్సిలర్లు తమ పరిధిలోని ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశీలించి, పైపుల లీకేజీలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలు కూడా నీటి సరఫరా పైపులకు క్యాప్‌లు అమర్చుకోవాలని సూచించారు. మున్సిపల్, మిషన్ భగీరథ అధికారులు సమన్వయంతో పనిచేసి నీటి వృథాను అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.

# జగన్నాథుని యాత్రలో 'టాస్' ఉపాధ్యాయులు

■ చారిత్రక , ఆధ్యాత్మిక క్షేత్రాలను సందర్శించిన టాస్ కుటుంబ సభ్యులు








**జోర్దార్ కల్చరల్ డెస్క్:**హనుమకొండ పట్టణానికి చెందిన టాస్ (టీచర్ అమిగోస్ వెల్ఫేర్ సొసైటీ) ఉపాధ్యాయ బృందం దసరా సెలవులలో ఐదు రోజుల ఒడిస్సా యాత్రకు బయలుదేరింది. ఈ సంఘానికి చెందిన ఉపాధ్యాయులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పూరి, భువనేశ్వర్ పరిసర ప్రాంతాల్లోని ఆధ్యాత్మిక, చారిత్రక, ప్రకృతి రమణీయ ప్రదేశాలను సందర్శించారు. జోర్దార్ కల్చరల్ డెస్క్ తో వారు పంచుకున్న యాత్ర విశేషాలు....

**పూరి శ్రీ జగన్నాథ ఆలయం**

12వ శతాబ్దానికి చెందిన రాజు అనంతవర్మన్ చోడగంగదేవుడిచే నిర్మితమైన ఈ దేవాలయంలో జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రాదేవి చెక్క విగ్రహాల రూపంలో కొలువుదీరి భక్తులను అలరిస్తారు. ఈ క్షేత్రం ప్రత్యేకమైన చెక్క విగ్రహాలు, ఆకాశాన్ని తాకే శిఖరం, నీలచక్రం, భారీ ఆలయ ప్రాకారాలు, రథయాత్ర, మహాప్రసాద సంప్రదాయాలతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. శ్రీమహావిష్ణువు బదరీనాథ్‌లో ధ్యానం, రామేశ్వరంలో స్నానం,పూరిలో భోజనం,ద్వారకలో విశ్రాంతి తీసుకుంటాడని ప్రతీతి.
దైవ దర్శనం అనంతరం, ఆలయ వంటశాలలో సంప్రదాయ పద్ధతిలో కట్టెల పొయ్యిలపై మట్టి కుండల్లో వండిన ఆహారాన్ని భక్తులు మహా ప్రసాదంగా స్వీకరించారు. కళింగ వాస్తుశిల్పం, మధ్యయుగ రాజ్య చరిత్ర, చెక్క విగ్రహాల సంప్రదాయం, నవకలేబర, మహాప్రసాదం, రథయాత్ర, వైష్ణవ--శైవ--శాక్త ఆరాధనల పరస్పర సంబంధం --- ఇవన్నీ కలిసే ఈ క్షేత్రాన్ని అసాధారణంగా నిలబెట్టాయని వారు పేర్కొన్నారు. విశ్వకర్మ దివ్య శిల్పిగా వచ్చి విగ్రహాలను రూపొందించాడని ఇక్కడ భక్తుల విశ్వాసంగా ఉంది. దేవస్థానంలో భక్తుల రద్దీ నియంత్రణలో కమిటీ వైఫల్యం కనబడిందని మరియు కొందరు పూజారుల వైఖరి భక్తుల మనోభావాలకు విరుద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు.

**చిల్కా సరస్సు**

ఆసియాలో అతిపెద్ద ఉప్పునీరు--మంచినీరు కలిసిన లగూన్‌గా ప్రసిద్ధి పొందిన చిల్కా సరస్సు శీతాకాలంలో లక్షలాది వలస పక్షులకు ఆశ్రయం ఇస్తుంది. సతపాడ ప్రాంతం ఇరావడి డాల్ఫిన్ల వీక్షణకు ప్రసిద్ధి. అయితే తమ యాత్రలో డాల్ఫిన్లు కనిపించలేదని యాత్రికులు నిరాశ చెందారు. విస్తారమైన నీటి ప్రదేశం, చిన్న ద్వీపాలు, దూరంగా కనిపించే పక్షుల గుంపులు, సముద్రపు గాలి ప్రత్యేకమైన అనుభూతిని కలిగించిందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో బోటులో విహారం ఆహ్లాదాన్ని కలిగించిందని వారు తెలియజేశారు.

**కోణార్క్ సూర్యదేవాలయం**

13వ శతాబ్దంలో తూర్పు గంగ వంశానికి చెందిన మొదటి నరసింహా దేవుడు నిర్మించిన ఈ దేవాలయం యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశంగా గుర్తింపు పొంది భారత పురావస్తు శాఖచే సంరక్షింప బడుతుంది. ఈ దేవాలయాన్ని ఆకాశంలో ప్రయాణించే సూర్యభగవానుని దివ్య రథంగా ఊహించి నిర్మించారు. రథాన్ని పోలిన భారీ పీఠం, చక్రాలు, గుర్రాల శిల్పాలు దీనికి ప్రత్యేకమైన రూపాన్ని అందిస్తాయి. మధ్యయుగ భారతీయుల శిల్పకళా నైపుణ్యానికి, ఖగోళ పరిజ్ఞానానికి, నిర్మాణ సాంకేతికతకు, సాంస్కృతిక వైభవానికి ఈ నిర్మాణం ప్రతీకగా నిలిచింది.
దేవాలయ ప్రవేశ భాగంలో కనిపించే సింహాలు, ఏనుగుల శిల్పాలు ప్రత్యేకమైనవి. అలాగే గోడలపై గుర్రాలు, యోధులు, సంగీతకారులు, జంతువులు, పక్షులు, పుష్పాలంకరణలు కనిపిస్తాయి. సూర్యుని దివ్యశక్తిని, కాలచక్రాన్ని, విశ్వగమనాన్ని ప్రతిబింబించే ఈ శిల్పాలు జ్యామితీయంగా నిర్మించబడ్డాయి. దేవాలయంలోని రాతి చక్రాల మధ్య భాగం, కమ్మీలు, అంచులపై చెక్కిన సూక్ష్మమైన అలంకరణలు సందర్శకులను ఆశ్చర్య పరిచాయి. ఇవి కాలగమనాన్ని, ఋతుచక్రాలను సూచిస్తాయి.
ఒకప్పుడు ప్రధాన గర్భగృహంపై ఎత్తైన శిఖరం ఉండేది. అది కాలక్రమంలో కూలిపోయింది. ప్రస్తుతం మిగిలిన జగమోహన మండపం, నాట్య మండపం, ఇతర శిల్పావశేషాలు ఈ కట్టడం యొక్క గత వైభవాన్ని చాటుతున్నాయి.
మూడవరోజు యాత్ర విశేషాలను వివరించిన టాస్ అధ్యక్ష కార్యదర్శులు కండెం శ్రీనివాస్, సంపత్ రావు మాట్లాడుతూ.. ఈ యాత్ర ద్వారా తమకు చారిత్రక ఆధ్యాత్మిక క్షేత్రాలపై అవగాహన ఏర్పడిందని, ఈ విశేషాలను విద్యార్థులకు బోధించి వారిలో ప్రత్యక్ష వీక్షన అనుభూతిని కలిగిస్తామని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో, సోదర ఉపాధ్యాయుల మధ్య ఆత్మీయ అనుభూతితో గడిపిన ఈ క్షణాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని వారు పేర్కొన్నారు. యాత్రను అందించిన ప్రకాష్ టూర్స్ అండ్ ట్రావెల్స్ మేనేజ్మెంట్ కు మరియు చక్కటి రుచికరమైన భోజనాలు అందజేసిన అశోక్ మరియు సిబ్బందికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# పద్మశాలీల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి):**హైదరాబాద్‌లోని చేనేత భవన్‌లో చేనేత కార్పొరేషన్ చైర్మన్ వెంకటరమణ, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్‌లను టీపీసీసీ కరీంనగర్ జిల్లా చేనేత సెల్ అధ్యక్షుడు బండారు సదానందం కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లాలోని పద్మశాలీలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చేనేత వృత్తికి అవసరమైన పరికరాలు, సామగ్రి అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా డీసీసీ కార్యదర్శి దూడం




వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# 26వ వార్డులో ఘనంగా చిన్న బతుకమ్మ వేడుకలు



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి):**హుజురాబాద్ మున్సిపల్ పరిధిలోని 26వ వార్డులో కౌన్సిలర్ కేశిరెడ్డి లావణ్య నరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎనిమిది రోజుల చిన్న బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఓల్డ్ వెంకటేశ్వర టాకీస్ సమీపంలోని పత్తి వాసుదేవరెడ్డి కాంప్లెక్స్‌లో ప్రతిరోజూ మహిళలు బతుకమ్మ ఆటపాటలతో సందడి చేస్తున్నారు.
దాతల సహకారంతో ప్రతిరోజూ ప్రసాదం పంపిణీ చేయడంతో పాటు లక్కీ డ్రా ద్వారా మహిళలకు చీరలు బహూకరిస్తున్నారు. సౌండ్, లైటింగ్, తాగునీటి సౌకర్యాలు కల్పించారు. గత మూడేళ్లుగా మహిళల కోరిక మేరకు వేడుకలు నిర్వహిస్తున్నట్లు కౌన్సిలర్ లావణ్య తెలిపారు.

# వ్యవసాయ బావిలో వ్యక్తి మృతదేహం లభ్యం

**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి):**హుజురాబాద్ మండలం రాజపల్లి గ్రామ శివారులో వ్యవసాయ బావిలో వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన విషాదం నింపింది. పోలీసుల వివరాల ప్రకారం.. శంకరపట్నం మండలం కేశవపట్నం గ్రామానికి చెందిన నెల్లి తిరుపతి (43) రెండేళ్లుగా తన అమ్మమ్మ గ్రామమైన రాజపల్లిలో నివసిస్తున్నాడు. గురువారం తెల్లవారుజామున ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించగా, సమీపంలోని వ్యవసాయ బావిలో మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు



కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

# వర్షాభావంతో ఎండుతున్న పంటలు ఆందోళనలో అన్నదాతలు



**ఆదిలాబాద్,(జోర్దార్ ప్రతినిధి):**ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో తీవ్ర వర్షాభావం, 37 డిగ్రీలకు పైగా నమోదవుతున్న ఉష్ణోగ్రతలతో పత్తి, సోయాబీన్ పంటలు దెబ్బతింటున్నాయి. పంట దిగుబడులు తగ్గిపోవడంతో పెట్టుబడులు కూడా చేతికి వచ్చే పరిస్థితి లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 11.40 లక్షల ఎకరాల్లో పత్తి, 2.20 లక్షల ఎకరాల్లో సోయాబీన్ సాగు చేశారు. నెల రోజులుగా వర్షాలు లేక వాగులు, చెరువులు ఎండిపోగా, విద్యుత్ సరఫరా అంతరాయాలతో పంటలకు నీరందించడం కష్టంగా మారింది. మరోవైపు అప్పుల భారం, పంట నష్టాలతో ఆదిలాబాద్ జిల్లాలో ముగ్గురు రైతులు ఆత్మహత్య చేసుకోవడం విషాదాన్ని నింపింది.
జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని బీఆర్ఎస్, బీజేపీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.
పంట నష్టపరిహారం, ఫసల్ బీమా అమలు చేయాలని కోరుతూ ఆందోళనలకు సిద్ధమవుతున్నారు.

# చండీ హోమంలో పాల్గొన్న మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ నవీన్ చంద్



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి):**హుజురాబాద్ పట్టణంలోని విద్యానగర్‌లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ దేవి శరణ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ వి. నవీన్ చంద్ ఐపీఎస్ హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.
ఈ సందర్భంగా పట్టణ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖశాంతులతో ఉండాలని, పండుగలను ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు వైష్ణవి మురళి మంచికట్ల, దామెర అనుషా--అనురాగ్, గురుస్వామి నటరాజ్ బుర్ర, ఎల్.వి. అర్జున్, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

శుక్రవారం,
అక్టోబర్ 16 2026



## నవాబుపేట గౌడ సంఘం అధ్యక్షుడిగా అనగాని తిరుపతి



**చిట్యాల,జోర్దార్ ప్రతినిధి:**చిట్యాల మండలం నవాబుపేట గ్రామ గౌడ సంఘం నూతన అధ్యక్షుడిగా అనగాని తిరుపతి గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.గ్రామంలో నిర్వహించిన గౌడ సంఘం ఎన్నికల్లో కుల సభ్యుల ఏకాభిప్రాయంతో తిరుపతి నుంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు తిరుపతి గౌడ్ ను సంఘ పెద్దలు, కుల సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా తిరుపతి గౌడ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన కుల పెద్దలు,యువకులకు, కుల సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.అందరినీ కలుపుకొని గౌడ సంఘం అభివృద్ధికి,కుల బాంధవుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, పెద్దలు,యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## హుజురాబాద్ తహాశీల్దార్ కార్యాలయంలో నాగుపాము కలకలం



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**హుజురాబాద్ పట్టణంలోని తహాశీల్దార్ కార్యాలయంలో గురువారం ఉదయం నాగుపాము ప్రత్యక్షమై సిబ్బంది, అర్జీదారులను భయాందోళనకు గురిచేసింది. కార్యాలయం తెరిచే సమయంలో వరండాలో కనిపించిన పాము రికార్డు గదిలోకి వెళ్లింది.దీంతో అప్రమత్తమైన సిబ్బంది ఎవరినీ లోపలికి వెళ్లకుండా అడ్డుకుని వెంటనే స్నేక్ క్యాచర్ అఫ్జల్ కు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకుని చాకచక్యంగా నాగుపామును పట్టుకుని నిర్మానుష్య ప్రాంతంలో విడిచిపెట్టారు.గతంలోనూ కార్యాలయంలోని కంప్యూటర్ విభాగంలోకి పాము ప్రవేశించిన ఘటనలు ఉన్నాయని సిబ్బంది తెలిపారు. కార్యాలయం వెనుకభాగంలో పిచ్చిమొక్కలు,చెట్లు పెరిగి, చెత్తాచెదారం పేరుకుపోవడంతో పాములకు ఆవాసంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయ పరిసరాలకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు.

## ఎల్ఎల్బీ సీటు సాధించిన అరుణ కుమారికి ఘన సన్మానం



**చింతూరు,(ఏపీ స్టేట్ జోర్దార్ బ్యూరో):**తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో 2026--29 విద్యా సంవత్సరానికి మూడేళ్ల ఎల్ఎల్బీ కోర్సులో సీటు సాధించిన కారు అరుణ కుమారిని ఆదివాసి సంక్షేమ పరిషత్ ఆంధ్రప్రదేశ్, పోలవరం జిల్లా ఆధ్వర్యంలో అడ్డతీగల మండలం సరంపేట గ్రామంలో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మాట్లాడుతూ, విద్యలో రాణించి ఆదివాసీల హక్కుల సాధనకు కృషి చేయాలని, న్యాయవాద వృత్తి ద్వారా గిరిజనులు, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మోడీద నూకరాజు, చోడి ప్రదీప్ కుమార్ దొర, చోడి ఏడుకొండలు రావు దొర, బల్లెం గంగాభవాని, లండ శారదాదేవి, కలుముల ప్రసాద్ దొర, ఇతర నాయకులు, అరుణ కుమారి కుటుంబ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రావణాసుర దహనం కార్యక్రమాన్ని రద్దు చేయాలి



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి):**దసరా సందర్భంగా నిర్వహించే రావణాసుర దహనం కార్యక్రమాన్ని రద్దు చేయాలని బీసీ ఉద్యమ వేదిక, తెలంగాణ అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బాణసంచా పేలుళ్లతో పర్యావరణానికి హాని కలగడంతో పాటు శబ్ద కాలుష్యం పెరుగుతుందని పేర్కొన్నారు.ఈ మేరకు మున్సిపల్ చైర్పర్సన్ రొంటాల సుహాసిని, కమిషనర్ కిషన్‌లకు వినతిపత్రం అందజేసి, ప్రజాధనాన్ని ఇలాంటి కార్యక్రమాలకు వినియోగించవద్దని కోరారు.

ఈ కార్యక్రమంలో సాదుల రవీందర్ బాబు, వేల్పుల రత్నం, మట్టెడ ప్రకాష్, వేల్పుల ప్రభాకర్, కొలిపాక సమ్మయ్య, కొలిపాక సారయ్య, కే. రాజేందర్, తిరునగరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# కోతులు బాబోయ్..కోతులు




ఒకప్పుడు అడవుల్లో.. గుట్టల్లో.. చెట్ల మధ్య కనిపించే వానరాలు, ప్రస్తుతం గ్రామాలు, పట్టణాలు, కాలనీల్లో సంచరించడమేగాక పంట పొలాలపై స్వైరవిహారం చేస్తున్నాయి.మనుషుల మీద దాడి చేస్తున్నాయి.కోతుల దాడిలో గాయపడి మృత్యువాత పడ్డ వారు అనేకం వున్నారు.
అడవుల్లో తినేందుకు సహజసిద్ధమైన ఆహారం దొరక్కపోవడం, తాగునీటి వనరులు తగ్గడం, గుట్టలు, చెట్లు రియల్ ఎస్టేట్ విస్తరణలో కనుమరుగవుతుండటం, ఫల వృక్షాలకు పూత, కాత తగ్గడంతో కోతుల గుంపులు మానవ ఆవాస ప్రాంతాలకు వస్తున్నాయి. ఫలితంగా వ్యయ ప్రయాసలు పడి సాగు చేసిన పంట పొలాలు, పండ్ల తోటలు దెబ్బతింటుండగా, మరోవైపు మహిళలు, చిన్నారులు సహా ప్రజలపై కోతుల దాడులు చేస్తుండటంతో భయాందోళనలు నెలకొంటున్నాయి.
రాష్ట్ర వ్యాప్తంగా కోతులు లేని గ్రామాలు లేవు.ప్రతి గ్రామం లో గుంపులు గుంపులుగా కోతులు హల్ చల్ చేస్తున్నాయి.జయశంకర్ భూపాల్ పల్లి,ములుగు,జనగాం,వరంగల్,హన్మకొండ జిల్లాల్లో మరీ కోతుల బాధలు ఎక్కువగా వున్నాయి.భూపాల్ పల్లి నుండి కాటారం మధ్యలో వేల కోతులు గుంపులుగా తిరుగుతూ పాదాచారులు,మోటార్ బైక్స్ మీద ప్రయాణం చేస్తున్న వారి మీద దాడులకు దిగుతున్నాయి.అనేక మంది గాయాల పాలు అయ్యారు.కొన్ని కోతులు లారీలు,కార్స్,బస్ల కింద పడి చనిపోతూ వున్నాయి
కొండలు, గుట్టలు, చెట్లు, కొమ్మలతో చిట్టడవులకు నిలయమైన ఈ జిల్లాల్లో దాదాపు లక్షల పైగా కోతులు ఉన్నట్టు అటవీశాఖాధికారుల అంచనా. వీటిలో దాదాపు 40 శాతం వరకు పిల్లకోతులేనని భావిస్తున్నారు. కోతుల సంతానోత్పత్తి కారణంగా విస్తృతంగా సంఖ్య పెరగడమేగాక, అటు ఊరు వాడ ల్లో సంచరిస్తూ, ఇటు పంటపొలాల్లో నాట్లు వేసిన నుంచి కోతలకు సిద్ధమయ్యే వరకు ధ్వంసం చేస్తూ, ప్రజలకు, రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. కోతుల నుంచి రక్షణకు వాటి సంతానోత్పత్తి నియంత్రణతో పాటు వాటిని సురక్షితంగా అటవీ ప్రాంతాల్లోకి తరలించేందుకు శాశ్వత పరిష్కార చర్యలు అవసరమని ప్రజలు కోరుతున్నారు. అందు కోసం రాష్ట్ర వ్యాప్తంగా కోతుల పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కనీసం రెండు, మూడు జిల్లాలను ఒక క్లస్టర్‌గా విభజించి, క్లస్టర్‌క ఒక కోతుల పునరావాస కేంద్రం ఏర్పాటుచేయాల్సిన అవసరం ఉందని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. కోతుల నియంత్రణకు కొన్నేళ్ల క్రితం నిర్మల్ జిల్లా చింతకుంటలో రూ.2.25కోట్లతో పునరావాస కేంద్రాన్ని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో ఏర్పాటుచేశారు. ఈ కేంద్రంలో కేవలం నెలకు 100 నుంచి 200 కోతుల వరకే సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేసే సామర్థ్యం ఉండటంతో ఆయా ప్రాంతాలకు పరిమితమంగానే ప్రయోజనాలు చేకూర్చాయి. అయితే ఇటువంటి కేంద్రాలను ప్రాంతాల వారీగా అందుబాటులోకి తీసుకురాడం ద్వారా కోతుల సంతానోత్పత్తి సంఖ్య నియంత్రణతో పా టు పట్టుబడిన కోతులను సురక్షిత పునరావాసం కల్పించే అవకాశం ఉంటుంది. కనీసం రెండు మూడు జిల్లాలకు ఒక కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా ఆయా ఆవాసాల నుంచి కో తులను పట్టుకుని సంతానోత్పత్తి నియంత్రణతో పాటు సురక్షిత ప్రాంతాల్లోకి పంపడం ద్వారా గ్రామాలు, పట్టణాల్లో ప్రజల ఇబ్బందులు తొలగుతాయి. అదే విధంగా పండ్ల తోటు, పంటలను కోతుల నుంచి సంరక్షించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు సైతం ఊతం లభిస్తుంది.
కోతుల బెడదను ఎదుర్కొవడం ప్రస్తుతం ప్రభుత్వాలకు, ప్రధానంగా స్థానిక సంస్థలకు పెద్ద సవాల్‌గా మారింది. పంచాయతీలు, మునిసిపాలిటీలు అభివృద్ధి నిధులను కోతుల నియంత్రణ కోసం మళ్లించాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్ని జిల్లాలో గ్రామాలు మునిసిపాలిటీలో నగరాలలో ఈ ఏడాది నిధులను కోతుల పట్టివేత కోసం వ్యయం చేశారు. అదే విధంగా చాలా ప్రాంతాల్లో సైతం కోతులను పట్టుకునేందుకు సుమారు రెండు నుంచి మూడు లక్షల రూపాయల వ్యయం చేశారు. మునిసిపాలిటీలు, పంచాయతీలు నిధులతో కోతులను పట్టి తరలించాలని ప్రజల నుంచి డిమాండ్లు తీవ్రమవుతున్నాయి.కామారెడ్డి కరీంనగర్ లో సెప్టెంబరు మాసంలో కోతుల గుంపుల సమస్యను తట్టుకోలేని అధికారులు వాటిని పట్టివేయించి, అటవీ ప్రాంతాలకు తరలించారు. కొన్ని ప్రాంతాల్లో గ్రామ ప్రజలే ఇంటికి రూ. 500చొప్పున నిధులు సేకరించి కోతులను పట్టించి, అటవీప్రాంతాలకు తరలిస్తున్నారు. దీంతో కనీసం నెల, రెండు నెలలు కూడా ఉపశమనం కలుగడం లేదని, తిరిగి మళ్లీ వచ్చి కిష్కింధకాండను కొనసాగిస్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. కోతులను పట్టుకుని అడవులకు తరలించే నిపుణులు రాష్ట్రంలో అందుబాటులో లేరు. ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చి వారి తో కోతుల పట్టివేత ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఒక్కో కోతిని పట్టుకునేందుకు రూ.500 నుంచి రూ.1,100 వరకు వారు చార్జ్ చేస్తున్నారని స్థానిక సంస్థల ప్రతినిధులు పేర్కొంటున్నారు. కోతుల పట్టివేత, తరలింపు భారమవుతుండగా, పట్టుకున్న కోతల సంఖ్య తప్పుగా చెబుతుండటంతో పెద్ద మొత్తంలో నిధులు దుర్వినియోగమవుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.
ఈ-పంచాయతీలో 'మంకీ మేనస్ సర్వే'
కోతుల బెడద నివారణ ప్రస్తుతం రాజకీయ, ఆర్థిక, సామాజిక సమస్యగా పరిణమించింది. ఈ నేపథ్యంలో కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టిసారించింది. గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా కోతుల నియంత్రణకు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనకు ఈ-పంచాయత్‌లో 'మంకీ మేనస్ సర్వే' చేపట్టాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ సర్వే ద్వారా ఆయా గ్రామాల పరిదిలో కోతుల సంఖ్య, వాటి ఉనికి, పంట నష్టం, ఆవాస ప్రాంతా ల్లో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు, తదితర వివరాలను పంచాయతీ కార్యదర్శుల ద్వారా సేకరించి ఈ-పంచాయత్ పోర్టల్‌లో నమోదు చేయనున్నారు. పంచాయతీల్లో గ్రామాల వారీగా కోతుల వివరాలను సేకరించిన ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్టుగా తెలుస్తుంది.ఈ సమాచారం ఆధారంగానే సమస్య తీవ్రత, నష్టం గుర్తించి వాటి నియంత్రణకు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికలు రూపొందించే అవకాశాలు ఉంటాయి.
కోతులను పట్టుకోవడం.. కొంత దూరంలో అటవీ ప్రాంతంలో వదిలివేయడం.. మళ్లీ అవే కోతులు ఆయా ప్రాంతాల్లోకి తిరిగి వచ్చి జనావాసాల్లో వీరవిహారం చేయడం పరిపాటిగా మారింది. దీంతో ఈ తంతుకు మంగళంపాడి శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని అధికారులు గుర్తించాలి. అందుకోసం శాస్త్రీయపద్ధతిలో దీర్ఘకాలిక కార్యాచరణను రూపొందించాలని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. అందులో ప్రధానమైనవి అడవుల పునరుద్ధరణ, స్థానికంగా ఫల వృక్షాలను పెంచడం, గ్రామీణ ప్రాంతాల్లో నీటి వనరుల అభివృద్ధి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అదే విధంగా కోతులకు ఆహారం వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించడం, సంతానోత్పత్తి నియంత్రణ, వ్యంధత్వ శస్త్ర చికిత్సలు, కోతుల పునరావాస కేంద్రాల ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కోతుల సమస్య ప్రస్తుతం వన్యప్రాణి సమస్యగా మాత్రమేగాక, రైతుల జీవనాధారం, ప్రజల భద్రత, స్థానిక సంస్థలపై ఆర్థిక భారంగా పరిణమించిన సమస్యగా మారింది. సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించి ప్రత్యేక కార్యాచరణను చేపట్టాల్సిన అవసరం ఎంతో ఉందని ఆయా స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు,సామాజిక సంస్థలు, ప్రతి ఒక్కరు పేర్కొంటున్నారు.

కామిడి సతీష్ రెడ్డి
భూపాల్ పల్లి జిల్లా
9848445134

## పెద్దపల్లి ఉప నమోదు కార్యాలయంలో దళారుల దందా

- డబ్బులిస్తే నిమిషాల్లో పని, లేకుంటే నెలల తిప్పలు
- జిల్లా కలెక్టర్ హెచ్చరికలను సైతం లెక్క చేయని వైనంలి

**(పెద్దపల్లిజోర్ధార్ ప్రతినిధి)**జిల్లా కేంద్రంలోని ఉప నమోదు కార్యాలయం (సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం) అక్రమాలకు అడ్డాగా మారింది. సామాన్య ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు దళారులు, ప్రైవేటు దస్తావేజు లేఖరులు యథేచ్ఛగా దందా సాగిస్తున్నారని సంచలన ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**కమీషన్ల కోసమే కొర్రీలు - సామాన్యులకు తిప్పలు:**
కార్యాలయానికి వచ్చే సామాన్య ప్రజలే లక్ష్యంగా దళారులు ఇక్కడ చక్రం తిప్పుతున్నారు. భూముల నమోదు, మార్కెట్ విలువల సవరణ, సాధారణ అధికార పత్రాలు (జీపీఏ), లేదా నిషేధిత జాబితాలోని భూములు (22-ఏ) అనే సాకులను చూపిస్తూ సామాన్యులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.
అధికారులు నేరుగా లంచాలు తీసుకోకుండా, తమకు నమ్మకమైన ప్రైవేటు వ్యక్తులను మధ్యవర్తులుగా పెట్టుకుని రహస్య సంకేతాల రూపంలో రేట్లు నిర్ణయించి వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. డబ్బులు ఇస్తే నిమిషాల్లో పూర్తయ్యే పని, ఇవ్వకపోతే రోజులు గడిచినా కావడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**అవినీతి నిరోధక శాఖ నిఘా - వరుస అరెస్టులతో బట్టబయలు:**
పెద్దపల్లి ఉప నమోదు కార్యాలయాల పరిధిలో అవినీతి ఏ స్థాయిలో ఉందో ఇటీవల జరిగిన అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) దాడులే నిదర్శనం.

**1. ఆన్ లైన్ లో లక్ష పైనే వసూలు:** పెద్దపల్లి కార్యాలయ మాజీ ఇన్ ఛార్జ్ ఉప నమోదు అధికారి మంద కిరణ్ కుమార్ దస్తావేజు లేఖరుల ద్వారా ఏకంగా 1 లక్షా 6 వేల రూపాయల లంచాన్ని ఆన్ లైన్ (యూపీఐ) రూపంలో వసూలు చేస్తూ అవినీతి నిరోధక శాఖకు చిక్కడం అప్పట్లో సంచలనం సృష్టించింది.

**2. మంథనిలో రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడుట:** జిల్లాలోని మంథని ఉప నమోదు కార్యాలయంలో భూమి నమోదు కోసం రషీద్ అనే ప్రైవేటు వ్యక్తి ద్వారా 16,500 రూపాయల లంచం తీసుకుంటూ ఉప నమోదు అధికారి కాసర్ల రాజేందర్ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు.

**సీసీ కెమెరాలు బంద్ - అనధికార వ్యక్తుల హవా:**
ఈ వరుస ఘటనలతో అవినీతి నిరోధక శాఖ అధికారులు పెద్దపల్లి జిల్లాలోని నమోదు కార్యాలయాలపై ప్రత్యేక నిఘా పెట్టారు. కార్యాలయాల్లో నిఘా కెమెరాలను ఉద్దేశపూర్వకంగా నిలిపివేయడం, అనధికారిక వ్యక్తులు కార్యాలయంలో కూర్చోవడంపై ఉన్నతాధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా పాలనాధికారి హెచ్చరించినప్పటికీ దళారుల తీరు మారడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దందాకు అడ్డుకట్ట వేసి, సామాన్య ప్రజలకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## గద్వాల బస్టాండ్‌లో దుర్వాసన ప్రయాణికుల అవస్థలు

**జోగులాంబ గద్వాల్,(జోర్దార్ ప్రతినిధి):**గద్వాల బస్టాండ్‌లో దుర్వాసనతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా క్యాంటీన్ పరిసరాల్లో అపరిశుభ్రత కారణంగా దుర్వాసన వస్తోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంబంధిత మున్సిపల్, ఆర్టీసీ అధికారులు స్పందించి పారిశుధ్య చర్యలు చేపట్టి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## ప్రభుత్వ భవనాల నిర్మాణానికి రూ.5.90 కోట్ల నిధులు మంజూరు



**వికారాబాద్,(జోర్దార్ ప్రతినిధి):**వికారాబాద్ నియోజకవర్గంలో ప్రభుత్వ భవనాల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం రూ.5.90 కోట్ల నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సహకారంతో వికారాబాద్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి ఒక ఎకరం భూమితో పాటు రూ.1.40 కోట్లు, వికారాబాద్, మోమిన్‌పేట్ ఎమ్మార్వో కార్యాలయాలకు ఒక్కొక్క దానికి ఒక ఎకరం భూమితో పాటు రూ.2.25 కోట్ల చొప్పున నిధులు మంజూరయ్యాయి. నిధుల మంజూరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు నియోజకవర్గ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## కాంగ్రెస్ వైఫల్యంతోనే రాష్ట్రంలో కరువు పరిస్థితులు



- బండ శ్రీనివాస్

**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)**రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యమే కారణమని బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బండ శ్రీనివాస్ ఆరోపించారు. గురువారం హుజురాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,వందలాది క్యూసెక్కుల నీరు వృథాగా సముద్రంలో కలుస్తున్నా, సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించుకునేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించలేదని విమర్శించారు.
కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్, ఉచిత విద్యుత్ అందించామని పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యుత్ అంతరాయాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.
ప్రభుత్వం వెంటనే స్పందించి సాగు, తాగునీరు, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల హామీలను అమలు చేయకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు గందె శ్రీనివాస్, వర్ధినేని రవీందర్ రావు, ఇరుమల్ల సురేందర్ రెడ్డి, టౌన్ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, రాజపల్లి సర్పంచ్ కటుకూరి మల్లారెడ్డి, మాజీ కౌన్సిలర్ తాళ్లపల్లి శ్రీనివాస్, గఫార్,ధనవర్ష రాజు,ఆర్కే రమేష్, సతీష్ తది తరులు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224

జోర్దార్

JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక

అవినీతి అంతం - మా పంతం

# ఆటో బోల్తా..

## మహిళ మృతి,పలువురికి గాయాలు



**జోగులాంబ గద్వాల్,(జోర్దార్ ప్రతినిధి):** జోగులాంబ గద్వాల్ జిల్లా ధరూర్ మండలం పార్చర్ల గ్రామ సమీపంలో ఆటో బోల్తాపడిన ప్రమాదంలో పావని (28) అనే మహిళ మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మృతురాలు డ్యాగాదొడ్డి గ్రామానికి చెందినట్లు సమాచారం.

ప్రమాదంలో గాయపడిన వారిని చికిత్స నిమిత్తం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గల కారణాలు, క్షతగాత్రుల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# దివ్యాంగుడికి

## నాలుగు చక్రాల వాహనం అందజేత



**వికారాబాద్,(జోర్దార్ ప్రతినిధి):** వికారాబాద్ పట్టణంలోని అంతగిరిపల్లికి చెందిన దివ్యాంగుడు పరమటి పెంటయ్యకు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య వికారాబాద్ క్యాంపు కార్యాలయ ట్రస్టు ద్వారా నాలుగు చక్రాల వాహనాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ దివ్యాంగులకు, పేదలకు సహాయం అందించడంలో ఎల్లప్పుడూ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. వాహనం అందుకున్న పెంటయ్య వారికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను

## ప్రభుత్వపరంగా ఆదుకుంటాం

■ **కలెక్టర్**



**జోగులాంబ గద్వాల,(జోర్దార్ ప్రతినిధి):** కర్ణాటకలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన, గాయపడిన గట్టు మండలం ఇందువాసి గ్రామానికి చెందిన బాధిత కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. బాధిత కుటుంబాల వివరాల సేకరణకు అధికారులను గ్రామానికి పంపనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వానికి నివేదిక అందించి ఆర్థిక సాయం అందేలా కృషి చేస్తామని, బాధితుల పిల్లలకు పాఠశాలల్లో ప్రత్యేక అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలు



**హుజురాబాద్,జోర్దార్ ప్రతినిధి:** హుజురాబాద్ మండల కేంద్రంలోని గ్రంధాలయం లో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పూలమాలతో పాఠకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏపీజే అబ్దుల్ కలాం భారతదేశానికి రక్షణ, అంతరిక్ష పరిశోధన, శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేవని, కలలు కనండి ఆ కలలను సహకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయండి అనే కలం సందేశం భారతదేశ ప్రజలకు స్ఫూర్తిదాయకమని పాఠకులు అభిప్రాయపడ్డారు.

ఈ కార్యక్రమంలో గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ సామాజిక కార్యకర్త,డాక్టర్ గంగిశెట్టి జగదీశ్వర్, తిరునాహరి రమేష్ కుమార్,టీఎస్ జిఆర్ఈఏ రిటైర్ ఉద్యోగుల హుజురాబాద్ యూనిట్ కార్యదర్శి కోయల్ కార్ దుర్గాజి,యాద శ్రీనివాస్, నవీన్,వెంకటేష్,స్వప్న పాల్గొన్నారు.

# దివ్యాంగుడికి బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటో అందజేత



**హనుమకొండ(జోర్దార్ ప్రతినిధి)** దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న 2024--25 సహాయ ఉపకరణాల పథకంలో భాగంగా కమలాపూర్ మండలానికి చెందిన దాసరి శ్రీనివాస్‌కు బ్యాటరీ మినీ ట్రేడింగ్ ఆటోను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దివ్యాంగులు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం సహాయ ఉపకరణాలను అందిస్తోందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రవి, జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ,సీడీపీవో స్వరూప, సీనియర్ అసిస్టెంట్లు వెంకట్రామ్, కలీమ్,ఎఫ్ఆర్ఓ రవికృష్ణ, రజిత,రాజేష్,దేవేందర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పుష్కర కాలంగా ఒకే చోట ఏవోలు, ఏడీఏలు

## నకిలీ ఎరువులు, నిషేధిత గడ్డిమందులపై వరుసగా కేసులు

**(హైదరాబాద్ జోర్దార్ అగ్రికల్చర్ బ్యూరో చీఫ్)** వ్యవసాయ శాఖలో కొందరు ఏవోలు, ఏడీఏలు పుష్కర కాలంగా ఒకే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో అధికారుల బదిలీలపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. దీర్ఘకాలంగా ఒకే చోట అధికారులు కొనసాగుతుండటంతో క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ వ్యవస్థపై ప్రభావం పడుతోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సమయంలో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో నకిలీ ఎరువులు, నిషేధిత గడ్డిమందుల విక్రయాలు వెలుగులోకి రావడం చర్చనీయాంశంగా మారింది.

ఖమ్మం జిల్లాలో నకిలీ ఎరువుల విక్రయాలు బయటపడినట్లు సమాచారం. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలో నిషేధిత గడ్డిమందు విక్రయాలు పోలీసు, విజిలెన్స్ అధికారుల దాడుల్లో వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. మరో జిల్లాలో నిషేధిత గ్లైఫోసేట్ గడ్డిమందు విక్రయాలను గుర్తించి కేసులు నమోదు చేసినట్లు సమాచారం. రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లోనూ నకిలీ ఎరువులు, నిషేధిత పురుగుమందుల విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కల్తీ ఎరువులు, నకిలీ పురుగుమందులు, నిషేధిత గడ్డిమందుల వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సుమారు రూ.10 వేల కోట్ల నుంచి రూ.12 వేల కోట్ల వరకు ఉండొచ్చన్న అంచనాలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ మొత్తం అంచనాకు సంబంధించి అధికారిక గణాంకాలు వెల్లడించాల్సి ఉంది.

ఈ పరిణామాల నేపథ్యంలో వ్యవసాయ శాఖలో దీర్ఘకాలంగా ఒకే స్థానంలో పనిచేస్తున్న ఏవోలు, ఏడీఏలను బదిలీ చేయాలన్న డిమాండ్ బలపడుతోంది. ఒకే ప్రాంతంలో సంవత్సరాల తరబడి అధికారులు కొనసాగడం వల్ల స్థానికంగా పరిచయాలు పెరగడంతోపాటు, అక్రమాలను అడ్డుకోవడంలో పర్యవేక్షణ లోపాలు తలెత్తే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

కొందరు అధికారుల అండదండలతోనే అక్రమ ఎరువులు, నిషేధిత పురుగుమందుల వ్యాపారం సాగుతోందన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉంది. వెలుగులోకి వస్తున్న ఘటనలపై సమగ్ర విచారణ జరిపితే అసలు వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.

రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ శాఖలో దీర్ఘకాలంగా ఒకే స్థానంలో పనిచేస్తున్న అధికారులపై సమీక్ష నిర్వహించి, అవసరమైన చోట బదిలీలు చేపట్టాలని రైతు వర్గాలు కోరుతున్నాయి. బదిలీలతో పాటు నకిలీ ఎరువులు, నిషేధిత గడ్డిమందులు, పురుగుమందుల విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తరచూ తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నాయి.

రైతులకు నాణ్యమైన ఎరువులు, పురుగుమందులు అందేలా చర్యలు తీసుకోవడంతోపాటు, అక్రమాలకు పాల్పడుతున్న వ్యాపారులపై మరియు వాటికి సహకరించినట్లు తేలితే సంబంధిత అధికారులపై కూడా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

# పారిశుద్ధ్య కార్మికులు,అంగన్వాడీ ఆశా

## సిబ్బందికి పండుగ కానుకలు



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన బతుకమ్మ, విజయదశమి పండుగల సందర్భంగా హుజురాబాద్ మున్సిపాలిటీ 20వ వార్డు కౌన్సిలర్ దామెర అనూష, అనురాగ్ దంపతులు తమ ఉదారతను చాటుకున్నారు. వార్డులోని పారిశుద్ధ్య కార్మికులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లకు నూతన వస్త్రాలను పండుగ కానుకగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దామెర అనూష, అనురాగ్ మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. వారి ముఖాల్లో సంతోషం చూడటమే తమకు నిజమైన పండుగ అని తెలిపారు. వార్డు ప్రజలందరూ సుఖసంతోషాలతో పండుగలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. వస్త్రాలు అందుకున్న సిబ్బంది దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో వార్డు ముఖ్య నాయకులు, మున్సిపల్ సిబ్బంది, అంగన్వాడీ, ఆశా కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# అతివేగం..అజాగ్రత్త డ్రైవింగ్

## సెలూన్ నిర్వాహకుడికి తీవ్ర గాయాలు

**హసన్‌పర్తి,(జోర్దార్ ప్రతినిధి)** అతివేగం,నిర్లక్ష్యంగా బైక్ నడిపి సెలూన్ నిర్వాహకుడిని ఢీకొట్టి తీవ్రంగా గాయపరిచిన వ్యక్తిపై హసన్‌పర్తి పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఆకు నూరి మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం గ్రామానికి చెందిన మాచర్ల భిక్షపతి (40) ఎర్రగట్టుగుట్ట సమీపంలో సెలూన్ నిర్వహిస్తున్నాడు. బుధవారం రాత్రి పని ముగించుకుని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా,గ్రీన్‌వుడ్ స్కూల్ సమీపంలో కోడెపాక రాజేంద్రప్రసాద్ పల్సర్ బైక్‌తో వేగంగా వచ్చి అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో భిక్షపతికి తలతో పాటు శరీర భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని 108 అంబులెన్స్‌లో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు.

పరిస్థితి విషమించడంతో హనుమకొండలోని బంధన్ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి భార్య మాచర్ల మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

# జోర్దార్ ఎఫెక్ట్!



ఫార్మర్‌కే మిస్టరీ గానే.. ఫార్మర్ రిజిస్ట్రీ...!

●స్వీయ నమోదు చేసుకునే ఛాన్స్ ఏదీ?
●మీ-సేవా.. సీఎస్సీ.. ఏఈవో కార్యాలయాల చుట్టూ రైతుల పరుగులు!
●రైతుల ఇక్కట్లపై ప్రశ్నిస్తే..
●జోర్దార్‌కు ముఖం చాటేసిన కమిషనర్ అండ్ కో!



(జోర్దార్ హైదరాబాద్ -- అగ్రికల్చర్ బ్యూరో చీఫ్) రైతుల సంక్షేమం కోసం తీసుకొచ్చిన ఫార్మర్ రిజిస్ట్రీ ఇప్పుడు రైతులకే కొత్త తలనొప్పిగా మారుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. తమ వివరాలు నమోదు చేయించుకునేందుకు రైతులు మీ-సేవా కేంద్రాలు, కామన్ సర్వీస్ సెంటర్లు (సీఎస్సీలు), ఏఈవో కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రైతుల కోసం రూపొందించిన రిజిస్ట్రీ ప్రక్రియను మరింత సులభతరం చేయాల్సిన సమయంలో.. రైతు తన మొబైల్ నుంచే స్వయంగా నమోదు చేసుకునే అవకాశం ఎందుకు కల్పించడం లేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

కేంద్రం నుంచి వచ్చే నజరానాలపైనే దృష్టా?
రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన అధికారులు.. కేంద్రం నుంచి వచ్చే నిధులు, ప్రోత్సాహకాలపైనే దృష్టి సారిస్తున్నారనే విమర్శలు రైతుల నుంచి వినిపిస్తున్నాయి.

పథకాలన్నింటికీ కీలకమే!
ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదయ్యే వివరాలు భవిష్యత్తులో పలు వ్యవసాయ సేవలు, సంక్షేమ పథకాలతో అనుసంధానం కానున్న నేపథ్యంలో.. ప్రతి అర్హత కలిగిన రైతు తన వివరాలు సక్రమంగా నమోదయ్యాయో లేదో తెలుసుకోవాల్సిన అవసరం ఉంది.పంట కొనుగోళ్లు, ఎరువుల సరఫరా, పంట రుణాలు, పీఎం కిసాన్ తదితర సేవలు, పథకాల అమలులో రైతుల వివరాలు కీలకంగా మారనున్న నేపథ్యంలో.. రిజిస్ట్రీపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని రైతులు చెబుతున్నారు.

రైతుల ఇక్కట్లపై ప్రశ్నిస్తే.. స్పందనేదీ?
రైతుల సమస్యలపై వివరణ కోరిన సమయంలో జోర్దార్‌కు ముఖం చాటేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారిందిరైతు కోసం తీసుకొచ్చిన వ్యవస్థలో రైతే ఇబ్బంది పడుతున్న పరిస్థితి మారాలని.. కార్యాలయాల చుట్టూ తిప్పే విధానం కాకుండా, రైతు ఇంటి నుంచే సేవలు పొందేలా ఫార్మర్ రిజిస్ట్రీని సులభతరం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

■ **రైతుల సమస్యపై స్పందించిన వ్యవసాయ డైరెక్టరేట్ అధికారులు..**

■ **స్వీయ నమోదు కోసం కొత్త యాప్ రూపకల్పన చేసిన వ్యవసాయ శాఖ..!**

■ **జోర్దార్ వరుస కథనాలతో కదిలిన యంత్రాంగం**

**(హైదరాబాద్ జోర్దార్ అగ్రికల్చర్ ప్రతినిధి)** రైతులకు ఫార్మర్ రిజిస్ట్రీ స్వీయ నమోదు ప్రక్రియ మిస్టరీగా మారిన అంశంపై "రైతుకు మిస్టరీగానే ఫార్మర్ రిజిస్ట్రీ" అంటూ జోర్దార్ పత్రిక ప్రచురించిన వరుస కథనాలు ఎట్టకేలకు ప్రభావం చూపాయి. రైతుల ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన అధికారులు, రైతులు స్వయంగా నమోదు చేసుకునేందుకు వీలుగా కొత్త యాప్‌ను రూపొందించారు.

ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు విషయంలో ఎదురవుతున్న సమస్యలను జోర్దార్ పత్రిక వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు స్పందించి స్వీయ నమోదు సదుపాయం కల్పించడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను గుర్తించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన జోర్దార్ పత్రికకు రైతులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

రైతుల సమస్యలపై అక్షర పోరాటం చేస్తూ, ప్రజల గొంతుకగా నిలిచిన జోర్దార్ పత్రిక కథనాలు అధికార యంత్రాంగంలో కదలిక తీసుకొచ్చాయనడానికి ఈ పరిణామమే నిదర్శనం.

# ఎన్‌హెచ్‌ఎం సమ్మెతో వైద్య సేవలకు

## అంతరాయం లేకుండా చర్యలు



**హనుమకొండ,(జోర్దార్ ప్రతినిధి):** ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె నేపథ్యంలో ప్రజలకు వైద్య సేవల్లో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య తెలిపారు. ఆయన పెద్దమ్మగడ్డ, పోచమ్మకుంట, లష్కర్‌సింగారం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి వైద్య సేవలను పరిశీలించారు.

గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బందిని డిప్యూటేషన్‌పై నియమించి సేవలు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

ఈ మూడు కేంద్రాల్లో 100 మందికి పైగా రోగులకు ఓపీ సేవలు అందిం చడంతో పాటు, కుక్కకాటు బాధితులకు కూడా చికిత్స అందించినట్లు వెల్లడించారు.

సమ్మె సమయంలోనూ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

# దసరా--బతుకమ్మ ఉత్సవాలకు

## పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

■ **బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో మహిళలకు ఇబ్బందులు కలగొద్దు**

■ **అధికారులకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సూచన**



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి)** దసరా,బతుకమ్మ పండుగలను ప్రజలు ఆనందోత్సాహాలతో, ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక సదు పాయాలు కల్పించాలని ఆదేశించారు.

హుజురాబాద్, జమ్మికుంట మున్సిపల్ కమిషనర్లు,కౌన్సిలర్లతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. వీణవంక, జమ్మికుంట, ఇల్లంతకుంట, కమలాపూర్ మండలా ల్లోనూ పండుగ ఏర్పాట్లపై ఆర్డీఓతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలుతీసుకోవాలని సూచించారు. బతుకమ్మ వేడుకలు జరిగే ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు, ట్రాఫిక్ నియంత్రణ,భద్రత, తదితర విషయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

నిమజ్జన ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సమస్యలు తలెత్తితే అధికారులు వెంటనే స్పందించేలా అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పండుగలను విజయవంతం చేయాలని కోరారు.

# సింహాద్రి కాలనీ

## నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక



**కరీంనగర్,(జోర్దార్ ప్రతినిధి)** కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని రేకుర్తి 20వ డివిజన్ సింహాద్రి కాలనీ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గడ్డం దామోదర్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం నరేష్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జె. రాము సింగ్,జి. మల్లేష్,కే. సమ్మయ్య,ఎన్. బద్రి నాయక్, సహాయ కార్యదర్శులుగా గడ్డం విజేందర్, రౌతు శంకర్, కోశాధికారిగా గుంటి మహేందర్, ప్రచార కార్యదర్శిగా జి. వేణు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని 20వ డివిజన్ కార్పొరేటర్ పర్వతం మల్లేశం, మాజీ కార్పొరేటర్ ఏదుల్ల రాజశేఖర్, కాంగ్రెస్ నాయకుడు అస్తపురం మారుతి సన్మానించారు.

కాలనీలో మౌలిక సదుపాయాల కల్పన, రహదారుల నిర్మాణం, కమ్యూనిటీ హాల్ ఏర్పాటు కోసం కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు.

# మల్లారం యువకుడికి

## జూనియర్ సివిల్ జడ్జి ఉద్యోగం

- ఏపీపీ ఫలితాల్లోనూ ప్రతిభ
- సాయి పవన్‌కు పలువురి అభినందనలు



**హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామానికి చెందిన ద్యాగల సారయ్య, సత్యవతి దంపతుల కుమారుడు సాయి పవన్ జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికై తల్లిదండ్రులు, గురువులకు పేరు తెచ్చారు. ఇంజినీరింగ్ పూర్తి చేసిన అనంతరం న్యాయవ్యవస్థపై ఆసక్తితో పశ్చిమ బెంగాల్‌లోని ఐఐటీ ఖరగ్‌పూర్‌లో ఎల్ఎల్‌బీ చేసి హనుమకొండ, వరంగల్ జిల్లా కోర్టుల్లో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తూ జూనియర్ సివిల్ జడ్జి కావాలనే లక్ష్యంతో మూడుసార్లు పరీక్షలు రాసి విజయం సాధించారు.ఇటీవల తెలంగాణ పోలీస్ శాఖ విడుదల చేసిన ఏపీపీ ఫలితాల్లోనూ ఆయన పదవి సాధించారు.సాయి పవన్ తండ్రి సారయ్య విశ్రాంత ప్రభుత్వ ఉపాధ్యాయుడు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు.సాయి పవన్ విజయంపై తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యుడు ముద్దసాని సహోదర రెడ్డి, ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిని నరేందర్, ఉపాధ్యక్షుడు తీగల జీవన్ గౌడ్,ఆర్గనైజింగ్ సెక్రటరీ చిల్ల రాజేంద్ర ప్రసాద్,రాష్ట్ర కమిటీ సభ్యులు జన్ను పద్మ, ఎగ్గడి సుందర్ రామ్,పలువురు న్యాయవాదులు సాయి పవన్ కు అభినందనలు తెలిపారు.

# పోచంపల్లి రమణారావు జన్మదిన వేడుకలు



**నల్గొండ,(జోర్దార్ ప్రతినిధి)** నల్గొండ జిల్లా కేంద్రంలో తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు,శ్రీ వైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పోచంపల్లి రమణారావు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.వివిధ జిల్లాల నుంచి వచ్చిన సంఘ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా రమణారావుమాట్లాడుతూ, ఎల్లప్పుడూ అందరికీ అందుబాటులో ఉంటానని, ఎవరికైనా సమస్యలు ఎదురైతే అండగా నిలుస్తానని తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విష్ణుదాసు గోపాల్‌రావు,ప్రధాన కార్యదర్శి కానాల శ్యాం సుందరరావు, సహకోశాధికారి గూడ రాజేశ్వరరావు,ప్రచార కార్యదర్శి గూడ జయరాం, సహాయ కార్యదర్శి దేవులపల్లి అశోక్‌కుమార్, సభ్యులు గూడ రాజు, వేదాంతం శ్రీనివాసా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలోని పలు జిల్లాలకు రాష్ట్ర విపత్తుల

## నిర్వహణ సంస్థ హెచ్చరిక

**అమరావతి :** ఏపీలోని పలు జిల్లాలకు విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. రాబోయే మూడు గంటల్లో చిత్తూరు, పుత్తూరు, సత్యవేడు, శ్రీసిటీ, తదితర పరిసర ప్రాంతాలలో పిడుగులతో కూడిన ఓ మోస్తరు వర్షం పడుతుందని తెలిపింది. 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని వెల్లడించింది.

ప్రకాశం, పల్నాడు, నంద్యాల, గుంటూరు,శ్రీసత్యసాయి , మార్కాపురం జిల్లాలకు ఎల్లో అలెర్ట్ ప్రకటించింది. ఆయా ప్రాంతాలల్లో చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని స్పష్టం చేసింది. ఆయా ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వివరించింది




# పెద్దపల్లిలో పేద దళిత కుటుంబానికి చెందిన ఇనాం ఆక్రమణ

## ఇరవై నాలుగు ఏళ్లుగా అమలుకు నోచుకోని ఉత్తర్వులు

**(పెద్దపెల్లి జోర్దార్ ప్రతినిధి)** పెద్దపల్లి పట్టణం, రీవా వార్డు, విద్యానగర్ నాలుగవ వీధి, లో నివసించే బొంకురి సుభాష్ అనే వ్యక్తి ఈ ఫిర్యాదు చేశారు. ఈయన షెడ్యూల్డ్ కులానికి చెందిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు. తండ్రి పేరు దివంగత బొంకురి పోచాలు. తండ్రి తొలి దశ తెలంగాణ ఉద్యమంలో చురుకుగా పాల్గొని పోలీసుల దెబ్బలకు గురై అనారోగ్యంతో బాధపడ్డారని తెలిపారు.

**2. భూమి వివరాలు:**
పెద్దపల్లి జిల్లా, పెద్దపల్లి మండలం, పెద్దపల్లి గ్రామం, సర్వే సంఖ్య ఆరు వందల తొంభై మూడు లో రెండు వందల ఎనిమిది చదరపు గజాల ఇనాం భూమి. ఇది ప్రభుత్వం మాదిగలకు ఇచ్చిన ఇనాం భూమి. చట్ట ప్రకారం ఈ భూమిని ఇతర కులాల వారికి అమ్మడానికి గానీ, బదలాయించడానికి గానీ వీలు లేదు.

**3. అప్పు పేరుతో జరిగిన మోసం:**
తండ్రి అనారోగ్యంతో ఉన్న సమయంలో ఇద్దరు వ్యక్తుల వద్ద అప్పు తీసుకోవడం జరిగింది.

- నూతి రామస్వామి అనే కమ్మరి కులస్తుడి వద్ద ఐదు వేల రూపాయలు
- గర్రెపల్లి విశ్వనాథం అనే వైశ్య కులస్తుడి వద్ద ఏడు వేల రూపాయలు

మొత్తం పన్నెండు వేల రూపాయలు అప్పు తిరిగి చెల్లించడంలో ఆలస్యం అయిందనే సాకుతో, ఆ ఇద్దరు వ్యక్తులు కుట్ర పన్నారు. మీ భూమిలో మేము అద్దెకు ఉంటామని నమ్మబలికి, మేజర్ గ్రామ పంచాయతీలో రెండు గుడిసెలకు ఇంటి సంఖ్యలు తీసుకున్నారు. సర్వే సంఖ్య వేయకుండా, రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మేనేజ్ చేసుకుని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. బాధితుడిని భయపెట్టి, తండ్రి మరణ ధ్రువీకరణ పత్రాన్ని బలవంతంగా తీసుకెళ్లి తెలియకుండా రిజిస్ట్రేషన్ చేసినట్లు ఫిర్యాదులో ఉంది.

**4. అధికారులు ఇచ్చిన ఉత్తర్వులు కూడా బుట్టదాఖలు:**
ఈ విషయంపై బాధితుడు పెద్దపల్లి తహశీల్దార్, పెద్దపల్లి రెవెన్యూ విభాగ అధికారి, అప్పటి కరీంనగర్ జిల్లా పాలనాధికారి గారికి ఫిర్యాదు చేయగా విచారణ జరిగింది.
అప్పటి రెవెన్యూ డివిజనల్ అధికారి తేదీ 30.12.2001 న ఉత్తర్వు సంఖ్య బి 8 /2597 ద్వారా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఇది షెడ్యూల్డ్ కులానికి చెందిన ఇనాం భూమి కాబట్టి ఇతరులకు చేసిన రిజిస్ట్రేషన్ చెల్లదని, ఆక్రమణదారులను తొలగించి భూమిని బాధితుడికి స్వాధీనం చేయాలని తహశీల్దార్ ను ఆదేశించారు.
ఆ ఉత్తర్వు ఆధారంగా అప్పటి తహశీల్దార్ క్షేత్రానికి వచ్చి పంచనామా చేసి భూమిని స్వాధీనం కూడా చేశారు. బాధితుడు మూడు సంవత్సరాలు ఆ భూమిలో ఉన్నారు.
కానీ ఇరవై నాలుగు సంవత్సరాలు గడిచినా పూర్తి న్యాయం జరగలేదు. ఆ ఇద్దరు వ్యక్తులు తిరిగి కేసులు పెడుతూ బాధితుడిని న్యాయస్థానాల చుట్టూ తిప్పుతున్నారు.

**5. ప్రస్తుత పరిస్థితి - అధికారుల నిర్లక్ష్యం:**
తాజాగా 25.03.2025 రోజున రెవెన్యూ డివిజనల్ అధికారి లేఖ సంఖ్య బి 1/ 2375-2024 ద్వారా మళ్లీ తహశీల్దార్ కు లేఖ రాశారు. బాధితుడి నెల దరఖాస్తు ఆధారంగా, క్షేత్రంలో వాస్తవ స్వాధీనం ఎవరి వద్ద ఉందో ఫోటోలతో నివేదిక ఇవ్వాలని కోరారు.
అంటే రెండు వేల ఒకటి లో ఇచ్చిన ఉత్తర్వు ఇప్పటి వరకు అమలు కాలేదు అనేది స్పష్టం అవుతోంది. ఇది రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనం.
భూమిని కొలవడానికి వచ్చిన అధికారులను కూడా ఆ ఇద్దరు వ్యక్తులు అడ్డుకుంటున్నారు. తహశీల్దార్ కార్యాలయం నుండి వచ్చిన అధికారులు కూడా సరైన కొలతలు వేయకుండా వెళ్తున్నారని, దీని వెనుక కొందరి ప్రోత్సాహం ఉందని బాధితుడు ఆరోపిస్తున్నారు.

**6. డిమాండ్:**
పన్నెండు వేల రూపాయల అప్పు కోసం రెండు వందల ఎనిమిది గజాల విలువైన భూమిని లాక్కోవడం అమానుషం. అందులోనూ షెడ్యూల్డ్ కులానికి చెందిన పేద కుటుంబాన్ని, తెలంగాణ ఉద్యమకారుడి కుటుంబాన్ని మోసం చేయడం క్షమించరాని నేరం.
రెండు వేల ఒకటి లో వచ్చిన ఉత్తర్వును ఇరవై నాలుగు ఏళ్లుగా అమలు చేయకపోవడం ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం.

అక్రమ రిజిస్ట్రేషన్ ను వెంటనే రద్దు చేసి, భూమిని శాశ్వతంగా బాధితుడికి స్వాధీనం చేయా అక్రమానికి పాల్పడిన ఇద్దరు వ్యక్తులపై, సహకరించిన రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

# ఇంటర్ విద్యా మండలి నియామకాల్లో జరిగిన

## అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ జరపాలి

- విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్న నకిలీ పత్రాల ముఠాపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపాలి
- గుర్తింపు లేని విశ్వవిద్యాలయాల పట్టాలతో ఉపాధ్యాయులుగా చలామణి అవుతున్న వారందరిపైనా క్రిమినల్ చర్యలు

**(హైదరాబాద్ జోర్దార్ విద్యా ప్రతినిధి)**

**1. అసలు కుంభకోణం ఏమిటి:**
రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇటీవల నియమించబడిన సుమారు 35 మంది అధ్యాపకుల నియామకం పెద్ద అనుమానాలకు తావిస్తోంది. వీరంతా బోధనకు పూర్తిగా పనికి రాని వారుగా తేలారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠం చెప్పలేని స్థితిలో ఉన్నారు. వీరు చూపించిన విద్యార్హత పత్రాలన్నీ నకిలీవని, డబ్బులు చెల్లించి కొనుగోలు చేసినవని ఆ కథనం స్పష్టం చేసింది. అసలు చదువు లేకుండా, పరీక్షలు రాయకుండా కేవలం అడ్డదారి ద్వారా ఉద్యోగాలు సంపాదించారని తేలింది.

**2. నకిలీ పట్టాల వెనుక ఉన్న బోగస్ విశ్వవిద్యాలయం:**
ఈ 35 మందిలో అత్యధికులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కళింగ విశ్వవిద్యాలయం పేరుతో ఉన్న దూరవిద్యా పట్టాలను సమర్పించారు. ఈ విశ్వవిద్యాలయానికి కేంద్ర ప్రభుత్వ గుర్తింపు లేదు.

- ఒక్క రోజు కూడా తరగతులకు వెళ్లలేదు.
- ఎటువంటి పరీక్ష కూడా రాయలేదు.
- కేవలం దళారులకు డబ్బు ఇస్తే చాలు, ఇంటికే పట్టా వచ్చేసింది.
- ఈ పట్టాలతోనే ఇంటర్ విద్యా మండలి నిర్వహించిన నియామక ప్రక్రియలో అర్హత సాధించారు.

ఇదే తరహాలో మరికొన్ని ఇతర ప్రైవేటు విశ్వవిద్యాలయాల పేర్లు కూడా తెరపైకి వస్తున్నాయి.

**3. తెర వెనుక నడిపించింది ఎవరు?:**
ఇది ఒక్క అభ్యర్థి చేసిన తప్పు కాదు. ఇది ఒక పెద్ద ముఠా పని.

- రాష్ట్రంలో కొంతమంది దళారులు ఈ దందాను నడుపుతున్నారు. ఒక్కో అభ్యర్థి వద్ద నుండి రెండు నుండి ఐదు లక్షల రూపాయల వరకు వసూలు చేశారు.
- 2016 నుండి 2024 మధ్య కాలంలో ఇచ్చిన పట్టాలను ఎక్కువగా వాడారు. ముఖ్యంగా 2023 సంవత్సరంలో ఇచ్చిన పట్టాలు అనుమానాస్పదంగా ఉన్నాయి.
- ఇంటర్ విద్యా మండలి లోని కొంతమంది అధికారుల పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పత్రాల పరిశీలన సరిగ్గా చేయకుండా ఎలా ఆమోదించారనేది ప్రశ్న.

**4. నష్టపోయింది ఎవరు?:**
ఈ నకిలీల వల్ల నిజంగా చదివి, కష్టపడి, అర్హతలు సంపాదించిన నిరుద్యోగ యువత నష్టపోయింది. వారికి రావాల్సిన ఉద్యోగాలను డబ్బు ఉన్న అనర్హులు కొట్టేశారు. అంతేకాకుండా, ఈ నకిలీ పంతుళ్ల వద్ద చదువుకునే లక్షలాది మంది ఇంటర్ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. అసలు విషయ పరిజ్ఞానం లేని వారు ఏమి బోధిస్తారు?

**5. తక్షణమే చర్యలు తీసుకోవాలి:**
ఈ విషయాన్ని ప్రభుత్వం చాలా తీవ్రంగా పరిగణించాలి.
అ) నియమితులైన 35 మంది అధ్యాపకులతో పాటు, గత ఐదు సంవత్సరాలలో నియమితులైన అందరి విద్యా పత్రాలను తిరిగి క్షుణ్ణంగా పరిశీలించాలి. ఒక ప్రత్యేక ఉన్నత స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేయాలి.

ఆ) కళింగ విశ్వవిద్యాలయం వంటి గుర్తింపు లేని విశ్వవిద్యాలయాల పట్టాలను వెంటనే రద్దు చేయాలి. ఆ విశ్వవిద్యాలయాల జాబితాను బహిరంగంగా ప్రకటించాలి.

ఇ) ఈ అక్రమ దందా నడిపిన దళారులను, సహకరించిన అధికారులను గుర్తించి వారిపై కఠినమైన నేర చర్యలు తీసుకోవాలి.

ఈ) నకిలీ పత్రాలతో ఉద్యోగం పొందిన వారిని వెంటనే విధుల నుండి తొలగించి, ఆ ఖాళీలను నిజమైన అర్హత కలిగిన అభ్యర్థులతో భర్తీ చేయాలి.

ఉ) భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఉండేందుకు, పత్రాల పరిశీలనకు బలమైన వ్యవస్థను తీసుకురావాలి.

**6. డిమాండ్**
విద్యా వ్యవస్థ అంటే ఒక తరాన్ని తీర్చిదిద్దే బాధ్యత. అటువంటి చోట డబ్బుతో పట్టాలు కొన్న వారికి చోటు కల్పిస్తే, అది విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడమే అవుతుంది. ఈ కుంభకోణంపై ప్రభుత్వం వెంటనే స్పందించి, సమగ్ర విచారణకు ఆదేశించకపోతే, విద్యార్థి సంఘాలు, నిరుద్యోగ సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరిస్తున్నాము.

# పూల సోయగాలు.. బతుకమ్మ సంబురాలు!

- మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక
- డీఆర్ఎం గోపాలకృష్ణన్
- వేడుకల్లో పాల్గొన్న రైల్వే ఉన్నతాధికారులు, యూనియన్ నాయకులు



**(సికింద్రాబాద్, జోర్దార్ ప్రతినిధి)** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ సికింద్రాబాద్ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

సికింద్రాబాద్‌లోని సంచాలన్ భవన్ ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలు పూల సోయగాలు, సంప్రదాయ పాటలు, మహిళల ఆటపాటలతో సందడిగా సాగాయి. రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మల చుట్టూ మహిళా ఉద్యోగులు సంప్రదాయ పాటలు పాడుతూ లయబద్ధంగా ఆడిపాడారు.

ఈ వేడుకలకు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాలకృష్ణన్, దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు సంధ్య గోపాలకృష్ణన్, మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ శంకర్ రావు, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ ముత్యాల నాయుడు, డివిజనల్ కార్యదర్శి కామ్రేడ్ రవీందర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

**తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక**
ఈ సందర్భంగా డివిజనల్ రైల్వే మేనేజర్ గోపాలకృష్ణన్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ మహిళల ఐక్యతను చాటిచెప్పే ఈ పండుగకు విశిష్టమైన స్థానం ఉందన్నారు.

ఇలాంటి సాంస్కృతిక వేడుకలు ఉద్యోగుల మధ్య స్నేహభావాన్ని, పరస్పర సహకారాన్ని, సామరస్యాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. మహిళా ఉద్యోగులందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

**శ్రామికుల ఐక్యతకు పండుగలు ప్రతీకలు**
మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ శంకర్ రావు మాట్లాడుతూ..
బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, సామూహిక జీవన విధానానికి నిదర్శనమని అన్నారు.
రంగురంగుల పూలతో ప్రకృతిని ఆరాధించే ఈ విశిష్ట సంప్రదాయం తెలంగాణ ప్రజల జీవన విధానంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుందని పేర్కొన్నారు.

ఇలాంటి పండుగలు శ్రామిక వర్గాల్లో సోదరభావాన్ని, ఐక్యతను, సమష్టి తత్వాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వివరించారు.

**ఉత్సాహంగా పాల్గొన్న రైల్వే ఉద్యోగులు**
ఈ వేడుకల్లో సీనియర్ డివిజనల్ పర్సనల్ అధికారి ఆనంద్ కట్ట, జోనల్ సహాయ ప్రధాన కార్యదర్శి నర్సింహారెడ్డి, రమాదేవి, సీసీఐఏఎస్ అధ్యక్షుడు చిలుకు స్వామి, సికింద్రాబాద్ డివిజనల్ అధ్యక్షుడు ఖాజాబాబా, డివిజనల్ కోశాధికారి నాగలక్ష్మి, జోనల్ కార్యవర్గ సభ్యుడు యుగంధర్ యాదవ్, కార్యదర్శులు సలీమ్, వినాయక రావు, శ్రీనయ్యతో పాటు మజ్దూర్ యూనియన్ నాయకులు ప్రభాకర్, అనిల్, జాహంగీర్, రోషన్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో రైల్వే ఉద్యోగులు హాజరై బతుకమ్మ సంబురాలను ఉత్సాహంగా జరుపుకున్నారు.

# మాతృమూర్తులందరికీ మాతృ దినోత్సవ శుభాకాంక్షలు

**మహిళల జీవన సాఫల్యం :**

- తల్లి కూతురు సోదరి భార్య - ఇలా ఎన్ని రూపాలలో ఉన్నా మహిళల కు జీవన సాఫల్యం లభి0చేది తల్లిగా మాత్రమే.
- తల్లి తన ఆలన పాలన తో మొదటి గురువుగా ఎన్నో రకాలుగా తన సంతానాన్ని తీర్చి దిద్దుతు0ది.
- అందుకే మాతృ దేవో భవ అనే గౌరవం పొ0ది0ది.
- అలా0టి తల్లులకు ప్రతి రోజూ మాతృ దినోత్సవమే.

**భారతీయ సంస్కృతిలో మాతృమూర్తి:**

- ఆడతనం అంటే అమ్మతనం .
- ఆడది సృష్టికి మూలం , అమ్మ మొదటి గురువు .
- సకల వనరులను అందిస్తున్న భూమిని భూమాత గా తల్లి తో పోల్చడం తల్లి ఔన్నత్యం .
- సకల విద్యలు అంది0చే విద్యా దేవత చదువుల తల్లి సరస్వతి మాత .
- గృహంలో ఒక్క మహిళ సంస్కారవంతురాలైతే కుటుబమంతా సంస్కారవంతమవుతు0ది. తద్వార మంచి సమాజం ఏర్పడుతు0ది.
- మాతా నిర్మాతా భవతి

సంతానాన్ని పె0చి పోషిస్తు0ది కాబట్టి తల్లి నిర్మాతగా ప్రసిద్ది

**తల్లి గొప్పదనం**

- నాస్తి మాతృ సమా ఛాయా నాస్తి మాతృ సమాగతి
- నాస్తి మాతృ సమంత్రాణం నాస్తి మాతృ సమా ప్రియా

--- మహా భారతం

(తల్లి లా0టి చల్లని నీడ మరేదీ లేదు . తల్లిని మి0చిన దిక్కు తల్లిలా రక్షి0చేది తల్లిని మి0చిన ప్రియమైనది వేరొకటి లేదు.)
అందుకే
మాతృదేవోభవ –

**మాతృ భూమి :**

మాతా భూమిః పుత్రో అహ0 పృథివ్యాః

( ఈ భూమి నాకు తల్లి – నేనామె పుత్రుడను )

- అహమస్మి సమాన ఉత్తరోనామ భూమ్యామ్ అభీషాడస్మి విశ్వాషాడా శామాశా0 విషాసహి0

( మాతృభూమి పట్ల ప్రేమ , కృతజ్ఞత కలిగివు0డడ0 కల్పన కాదు . పిల్లలు తల్లి పాలు తాగడ0 చేత తల్లి మీద ప్రేమ వు0టు0ది . అలాగే మాతృభూమి ను0డి మనకు కావలసిన సమస్త పదార్థాలు గ్రహిస్తా0 కనుక మనకు దానిమీద ప్రేమ తప్పనిసరి )

**అ0దుకే శ్రీరామ చ0ద్రుడు లక్ష్మణుని తో అన్నాడు**

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ ‘ అని

( కన్నతల్లి మరియు జన్మభూమి స్వర్గాని క0టే గొప్ప )

**నేటి సంతానం బాధ్యత**

- అమ్మ పై ప్రేమ ఒక రోజు ముచ్చట మాత్రమే కాకూడదు.
- మాతృదినోత్సవం రోజున అమ్మ గొప్పతనం మరియు అమ్మ ప్రేమకు సంబంధి0చిన టన్నుల కొలది మెసేజ్ లు ఈ రోజు మనకు మీడియాలో దర్శనమిస్తాయి.
- కొలువలేని అమ్మ ప్రేమకు మనం చూపి0చే కృతజ్ఞత ఎలావు0డాలి?
- తను - మన - ధన -రూపంలో అంది-చాల్సిన సేవ.

కాని ధనరూపంలో ( కానుకలు , సేవకులను సమకూర్చడం లేదా వృద్ధాశ్రమాలలో చేర్చడం వంటివి కాదు.

- మనః పూర్వకంగా తనువు తో సేవచేయడం అని గుర్తి0చాలి .
- వృద్ధాప్యంలో వారికి కావలసినది మానసికస్వా0తన . అదే వారికి స0తోషాన్ని చ్చే టానిక్ .
- తల్లి మానసిక అవసరాలను అర్థ0 చేసుకోవడం ముఖ్యం గాని , మెసేజ్ లు మరియు కానుకలు కాదు .
- అలాగే తల్లి పై ప్రేమ 365 రోజులది కావాలి గాని ఒక్క రోజుది మాత్రమే కాకూడదు .

**చివరి మాట**

- మానవ సృష్టికి మూల0 అమ్మ .
- అలా0టి పుట్టబోయే అమ్మలను గర్భ0లోనే చ0పాలనుకోవడ0 అమానుష0

వందే మాతరం ??
భారత్ మాతాకీ జై

**డా. శ్రీనివాసరెడ్డి.**

# హుజూరాబాద్ కాంగ్రెస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



**హుజురాబాద్,(జోర్దార్ ప్రతినిధి):**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని కాంగ్రెస్ పార్టీ హుజురాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. గురువారం హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించి, మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ మహిళల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, వారి సంక్షేమానికి మరిన్ని పథకాలు ప్రవేశపెడతామని పేర్కొన్నారు. అనంతరం మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి, పాటలు పాడారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుహాసిని, కౌన్సిలర్లు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్య పథకం అమలేది?

- నెలనెలా చందాలు వసూలు.. వైద్యం అందించడంలో నిర్లక్ష్యమా?
- నగదు రహిత వైద్యం అందించాలి.. రూ.10 లక్షలకు చికిత్స పరిమితి పెంచాలి
- రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిన పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షుడు టి. పురుషోత్తం




**(హనుమకొండ, జోర్దార్ ప్రతినిధి)**ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఎన్ఈహెచ్ఎస్)ను అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో సమర్థంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. పురుషోత్తం డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి చందాలు వసూలు చేస్తున్నప్పటికీ, అవసరమైన సమయంలో నగదు రహిత వైద్యం అందకపోవడం ఆందోళన కలిగిస్తోందని పేర్కొన్నారు. ఆరోగ్య పథకంలోని సమస్యలను వెంటనే పరిష్కరించి ఉద్యోగులు, పెన్షనర్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.
రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు గురువారం హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు సమర్పించాల్సిన వినతిపత్రాన్ని, కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో జాయింట్ కలెక్టర్ ఎన్. రవికి అందజేశారు. ఆరోగ్య పథకంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి పంపించాల్సిన వినతిపత్రాన్ని జిల్లా కమిటీ ప్రతినిధులు సమర్పించారు.

**ప్రారంభోత్సవానికే పరిమితమైందా?**

ఈ సందర్భంగా టి. పురుషోత్తం మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల కోసం నూతన ఆరోగ్య పథకాన్ని జూలై 17న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రారంభించినప్పటికీ, క్షేత్రస్థాయిలో ఆశించిన స్థాయిలో సేవలు అందడం లేదని విమర్శించారు. పథకం ప్రారంభమై నెలలు గడుస్తున్నా అనేక కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
కొత్త ఆరోగ్య కార్డులు అందుబాటులోకి రాకపోవడం, పాత కార్డులపై కూడా గతంలో మాదిరిగా వైద్య సేవలు పొందలేకపోవడం, వెల్‌నెస్ కేంద్రాల్లో వైద్యులు, మందుల కొరత వంటి సమస్యలు ఉద్యోగులు, పెన్షనర్లను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని తెలిపారు.

**చందాలు వసూలు చేస్తున్నా.. నిధులపై స్పష్టత ఏదీ?**

ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి వారి వేతనాలు, పింఛన్లలో 1.5 శాతం చొప్పున నెలవారీ చందాలు వసూలు చేస్తున్నారని పురుషోత్తం తెలిపారు. నెలకు సుమారు రూ.45 కోట్ల చొప్పున ఐదు నెలల్లో రూ.225 కోట్లు సమకూరినట్లు పేర్కొన్నారు. ఈ మొత్తానికి సమానంగా ప్రభుత్వం కూడా తన వాటా నిధులను ట్రస్టుకు జమ చేయాల్సి ఉంటుందని చెప్పారు.
అయితే ప్రభుత్వం తన వాటా నిధులను జమ చేసిందా? లేదా? అనే విషయంపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. చందాలు చెల్లిస్తున్న ఉద్యోగులు, పెన్షనర్లకు సకాలంలో వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఆరోగ్య కార్డులు పనిచేయకపోవడం, ఆసుపత్రుల్లో నగదు రహిత చికిత్స అందకపోవడం వంటి సమస్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని కోరారు.

**ఆరోగ్యశ్రీ తరహాలో రూ.10 లక్షల వరకు వైద్యం అందించాలి**

జిల్లా సంఘం సహాధ్యక్షుడు ఎం. ప్రకాశ్ మాట్లాడుతూ.. ప్రజలకు ఆరోగ్యశ్రీ పథకం ద్వారా గరిష్ఠంగా రూ.10 లక్షల వరకు వైద్య చికిత్స అందించే అవకాశం ఉండగా, ఉద్యోగులు, పెన్షనర్లు తమ వేతనాలు, పింఛన్ల నుంచి చందాలు చెల్లిస్తున్నప్పటికీ వారి ఆరోగ్య పథకంలో చికిత్స పరిమితిని రూ.3 లక్షలకే నిర్ణయించడం సమంజసం కాదన్నారు.
ఈ అంశాన్ని ప్రభుత్వం, ఆరోగ్య పథకం ధర్మకర్తల మండలి సభ్యులు పునఃపరిశీలించాలని కోరారు. ఉద్యోగులు, పెన్షనర్లకు కూడా రూ.10 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స అందించేలా పరిమితిని పెంచాలని డిమాండ్ చేశారు.

**అన్ని ఆసుపత్రుల్లో బహిరంగ వైద్య సేవలు కల్పించాలి**

ఆరోగ్య పథకంలో చేరే విషయంలో పెన్షనర్లకు తమ అభిప్రాయాన్ని తెలిపే అవకాశం కల్పించాలని కొందరు పెన్షనర్లు కోరుతున్నట్లు పురుషోత్తం తెలిపారు. వెల్‌నెస్ కేంద్రాలకే పరిమితం కాకుండా అన్ని ఆసుపత్రుల్లోనూ బహిరంగ వైద్య సేవలు (ఓపీ) అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అన్ని రకాల వ్యాధులకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స పొందే సౌకర్యం కల్పించాలని కోరారు.
ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించాలని, ఆరోగ్య కార్డులు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యం అందేలా పర్యవేక్షణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**వినతిపత్రం సమర్పించిన సంఘం ప్రతినిధులు**

ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు టి. రత్నాకర్, ఎల్. సూర్యప్రకాశ్, ఎం. సింగారెడ్డి, గైని సత్యనారాయణ, కే. రమేష్, కిష్టయ్య, సుక్కారెడ్డి, హనుమకొండ ఉప ఖజానా కార్యాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎల్. ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కందుకూరి దేవదాసు, శ్యాంసుందర్ రెడ్డి, బిల్లా సుబ్బారావు, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి!

- ఏళ్ల తరబడి సేవలందిస్తున్న ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యమెందుకు?
- హామీలు కాదు.. పరిష్కారానికి స్పష్టమైన నిర్ణయం, గడువు ప్రకటించాలి
- జనసేన నాయకుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ డిమాండ్




**(శంషాబాద్, జోర్దార్ ప్రతినిధి)**ప్రజారోగ్య వ్యవస్థలో ఎన్నో ఏళ్లుగా కీలక సేవలందిస్తున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని జనసేన నాయకుడు డాక్టర్ బండారి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. శంషాబాద్‌లో నిర్వహించిన జాతీయ ఆరోగ్య కార్యక్రమ ఉద్యోగుల సభకు ఆయన హాజరై, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లకు మద్దతు ప్రకటించారు.
ప్రజల ఆరోగ్య పరిరక్షణలో నిరంతరం సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడం సమంజసం కాదని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల ఇబ్బందులపై ప్రభుత్వం, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.
జాతీయ ఆరోగ్య కార్యక్రమ కమిషనర్ సంగీత సత్యనారాయణ ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి, ఉద్యోగుల డిమాండ్లపై స్పష్టమైన నిర్ణయం ప్రకటించాలని డాక్టర్ రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైనదని, అలాంటి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంలో జాప్యం చేయడం తగదని అన్నారు.
సేవలు మాత్రం నిరంతరం కావాలి.. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడానికి మాత్రం సమయం లేదా? అని ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉద్యోగులు తమ న్యాయమైన హక్కుల కోసం రోడ్డెక్కి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వస్తోందని నిలదీశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న ఉద్యోగుల ఉద్యోగ భద్రతకు భరోసా కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.
ఉద్యోగులకు హామీలు ఇవ్వడంతో సరిపెట్టకుండా, వారి సమస్యల పరిష్కారానికి కార్యాచరణ ప్రకటించాలని ఆయన కోరారు. ఏ సమస్యను ఎప్పటిలోగా పరిష్కరిస్తారో స్పష్టమైన గడువు వెల్లడించాలని డిమాండ్ చేశారు.
ప్రజారోగ్య సేవలకు ఆటంకం కలగకుండా ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డాక్టర్ బం దారి రాజ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు.

# అక్టోబర్ 20 నుంచి వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్య సేవలు

- డిసెంబర్ చివరి నాటికి పూర్తి స్థాయిలో సేవలు
- మంత్రి పొంగులేటి



**వరంగల్,(జోర్దార్ ప్రతినిధి):**పేద ప్రజలకు కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అత్యాధునిక వైద్య సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో ఈ నెల 20 నుంచి పరిమిత వైద్య సేవలు ప్రారంభించి, నవంబర్‌లో మరిన్ని సేవలు అందుబాటులోకి తీసుకొచ్చి, డిసెంబర్ చివరి నాటికి పూర్తి స్థాయిలో ప్రారంభిస్తామని వెల్లడించారు. గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి సీతక్క, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు ఆసుపత్రిని పరిశీలించారు.
అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో పొంగులేటి మాట్లాడుతూ.. ఉత్తర తెలంగాణ ప్రజలు అత్యాధునిక వైద్యం కోసం హైదరాబాద్‌కు వెళ్లాల్సిన అవసరాన్ని తగ్గించి, వరంగల్‌లోనే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆసుపత్రిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. పేదలు వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడకుండా ఉచితంగా నాణ్యమైన వైద్యం అందిస్తామని స్పష్టం చేశారు.
ప్రస్తుతం ఎంజీఎం ఆసుపత్రిలో రోజుకు మూడు వేల మందికిపైగా రోగులకు వైద్య సేవలు అందుతుండగా, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే రోజుకు నాలుగు నుంచి ఐదు వేల మందికి సేవలు అందించే సామర్థ్యం పెరుగుతుందని వివరించారు.
ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు, కుడా చైర్మన్ గుండు సుధారాణి, కలెక్టర్లు డాక్టర్ సత్య శారద, చాహత్ బాజ్‌పాయి,ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, వైద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

శుక్రవారం,
అక్టోబర్ 16 2026

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY
తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం





విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ 'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. రశ్మిక మందన్న హీరోయిన్ గా నటిస్తోంది. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై "రణబాలి" సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ నెల 16న విజయదశమి పర్వదినం సందర్భంగా "రణబాలి" సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ చిత్ర ప్రీ రిలీజ్ ఈవెంట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా హీరో విజయ్ దేవరకొండ ఆసక్తికర కామెంట్స్ చేశారు. 'ఈ రోజు ఈవెంట్ కు వచ్చిన నా డైరెక్టర్స్ అందరికీ థ్యాంక్స్. వాళ్లలో కొందరితో వర్క్ చేశా. మరికొందరితో చేయబోతున్నా. మీలాంటి మంచి డైరెక్టర్స్ వల్లే నేను రోజూ హ్యాపీగా షూట్ కు వెళు న్నా. తిరుపతి బ్రహ్మోత్సవాలు, తెలంగాణలో బతుకమ్మ పండుగ, విజయవాడలో ఉత్సవాలు మొదలయ్యాయి, పిల్లలకు హాలీడేస్ మొదలయ్యాయి. అంతటా ఒక పండుగ వైబ్ ఉంది. ఈ నెల 16న తెలుగు చిత్ర పరిశ్రమ గర్వపడేలా రణబాలి వస్తోంది. రాహుల్ తన నెక్ట్స్ మూవీ రూరల్ పీరియాడిక్ యాక్షన్ మూవీ చేయాలనుకున్నప్పుడు ఆయన ఊరికి వెళ్లి అక్కడ కథలు వింటూ, జాతరలు, పండుగలు చూస్తూ. ఆ జాతరలో చెప్పే బుర్రకథలు, జానపదాలు వింటూ అందులోని వీరుల గురించి తెలుసుకున్నాడు. వాటి నుంచి ఒక భారీ నేపథ్యమున్న సినిమాను ఊహించాడు. ఈ సినిమా గురించి వర్క్ చేస్తుంటే చరిత్రలో దాచిన కొన్ని అధ్యాయాల గురించి రాహుల్ తెలుసుకున్నాడు. అప్పుడు ఈ రణబాలి సినిమాకు ఒక గొప్ప పర్పస్ ఏర్పడింది. రాహుల్ నాతో ఒక రూరల్ మాస్ సినిమా చేసినా, ఒక హిస్టారికల్ యాక్షన్ సినిమా చేసినా ఇంత మజా వచ్చి ఉండేది కాదేమో. రాహుల్ తను చెప్పాలనుకున్న పీరియడ్ యాక్షన్ ఫిలిం, ఒక పర్పస్ ఫుల్ ఎలిమెంట్ ఏదీ వదలకుండా బ్యూటిఫుల్ గా స్క్రిప్ట్ చేసి రణబాలి సినిమా రూపొందించాడు. రాహుల్ తన కెరీర్ కొనసాగించడానికి సినిమాలు చేయడు, కొన్ని గొప్ప కథలు చెప్పేందుకు సినిమాలు రూపొందిస్తాడు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి గారు సూపర్ ఎల్ నినో ప్రభావం గురించి చెప్పారు. ప్రజల్ని జాగ్రత్తగా ఉండమన్నారు. సరిగ్గా 150 ఏళ్ల క్రితం సూపర్ ఎల్ నినో వచ్చింది. అదే గ్రేట్ మద్రాస్ ఫామైన్.

## ఆ సినిమా ఫ్లాప్ కావడంతో వారు బాగా ఎంజాయ్ చేశారు..



## రాజా సాబ్ ఫెయిల్యూర్ పై నిర్మాత రియాక్షన్..

నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్ ఇటీవల గరివిడి లక్ష్మి సినిమా ప్రమోషన్లలో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే తాజాగా నిర్వహించిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ.. తన నిర్మాణ సంస్థ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ (పీఎంఎఫ్) ప్రయాణం, ముఖ్యంగా రాజాసాబ్ చిత్రం వైఫల్యంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. పీఎంఎఫ్ కెరీర్‌లో రాజాసాబ్ అతిపెద్ద నిరాశను మిగిల్చిందని ఆయన అంగీకరించారు. అయితే, ఈ అనుభవం నుండి చాలా విషయాలు నేర్చుకున్నట్లు పేర్కొన్నారు. పీఎంఎఫ్ గతంలో ఎమ్మెల్యే, గూఢచారి 2, గూఢచారి, వెంకీ మామ, ఓ బేబీ, కార్తికేయ 2, ధమాకా వంటి అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించింది. ఈ చిత్రాలు కొన్ని నిర్దిష్ట కమర్షియల్ ఫార్ములాతో విజయవంతమయ్యాయని విశ్వ ప్రసాద్ తెలిపారు. మంచి దర్శకుడు, నటుడు, కొన్నిసార్లు కాంబినేషన్‌కు మించి బడ్జెట్ కేటాయించడం వంటి అంశాలతో సక్సెస్‌ను సాధించామని వివరించారు. అయితే, గత జనవరి తర్వాత పరిస్థితులు మారాయని, ఓటీటీ ప్రభావం, క్రమశిక్షణ లేకపోవడం వంటి కారణాల వల్ల కొన్ని చిత్రాలు నష్టాలను చవిచూశాయని ఆయన పేర్కొన్నారు. 2024, 2025లో ఈ తప్పులను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు.రాజాసాబ్ వైఫల్యానికి గల కారణాలను వివరిస్తూ, సినిమా తప్పుడు సీజన్‌లో విడుదల కావడం ఒక ప్రాథమిక లోపంగా ఆయన అన్నారు. వేరే సమయంలో విడుదలై ఉంటే సినిమా ఫలితం భిన్నంగా ఉండేదని ఆయన బలంగా నమ్ముతున్నట్లు తెలిపారు. సీజన్‌తో పాటు, విడుదల రోజున ఎదురైన సమస్యలు కూడా చిత్రానికి ప్రతికూలంగా మారాయి. ప్రీమియర్‌లు ఆలస్యం కావడం, టికెట్ ధరలను పెంచడానికి ప్రయత్నించడం వంటివి ప్రేక్షకుల ఆగ్రహానికి కారణమయ్యాయి. టికెట్ ధరల పెంపు అనేది తాము చేసిన మొదటి ప్రయత్నమని, అది చేయకుండా ఉండాల్సింది అని ఆయన పేర్కొన్నారు. ఈ కారణాలన్నీ కలసి రాజాసాబ్ చిత్రానికి ఆశించిన విజయాన్ని దూరం చేశాయని తెలిపారు.అలాగే, ప్రభాస్ నటించిన "స్పిరిట్" చిత్రానికి సంబంధించిన తెలుగు హక్కులు పీఎంఎఫ్ వద్ద ఉన్నాయని, దానితో రాజాసాబ్ లోటును పూడ్చుకుంటారా అని అడగ్గా.. తాను ఆ చిత్రానికి కేవలం డిస్ట్రిబ్యూటర్‌ను మాత్రమేనని విశ్వ ప్రసాద్ స్పష్టం చేశారు. డిస్ట్రిబ్యూటర్‌గా సినిమాకు ఉత్తమమైన విడుదల సైజు, స్కేల్‌ను అందించడంలో రాజాసాబ్ విషయంలోనూ తాము విజయవంతమయ్యామని గుర్తు చేశారు.



## నేను కాళ్లు పట్టుకోమన్నానా..! షాలినీ, శివ్ మధ్య వివాదం

బిగ్ బాస్ తెలుగు 9 హౌస్‌లో ఆరోవారం కెప్టెన్సీ పోటీ రసవత్తరంగా మారింది. ఈసారి వైల్డ్ కార్డ్ కంటెస్టెంట్లకు బిగ్ బాస్ ప్రత్యేక అవకాశాన్ని ఇచ్చాడు. కెప్టెన్సీ పోటీదారులుగా నిలిచే ఛాన్స్ కల్పించడంతో పాటు, తమ పాయింట్లను కాపాడుకుంటూ ఇతర టీమ్‌ల స్కోర్‌ను తగ్గించుకునేలా కొత్త టాస్క్‌ను ఇచ్చాడు. దీంతో హౌస్‌లోని పాత కంటెస్టెంట్లపై వైల్డ్ కార్డ్స్ ఎలాంటి అభిప్రాయంతో ఉన్నారనే విషయం ఆసక్తికరంగా మారింది. హౌస్‌లో ఇప్పటికే ఉన్న ఓజీ కంటెస్టెంట్ల ఆటతీరును బయట నుంచి గమనించిన వైల్డ్ కార్డ్ సభ్యులకు బిగ్ బాస్ ఓ ప్రత్యేక టాస్క్ ఇచ్చాడు. ఒక్కో కంటెస్టెంట్ ప్రవర్తనకు సరిపోయే లక్షణాలను గుర్తించి వారికి తగిన ట్యాగులు ఇవ్వాలని సూచించాడు. ఈ అభిప్రాయాల ఆధారంగా ప్రత్యర్థి టీమ్ పాయింట్లను తగ్గించుకోవడంతో పాటు, తమ స్కోర్‌ను పెంచుకునే అవకాశం కల్పించాడు.ఈ క్రమంలో శ్వేత నాయుడు.. రోహిత్‌కు డ్రామా కింగ్ అనే ట్యాగ్ ఇచ్చింది. త్రిగుణ్‌కు మానిప్యులేటర్, రామ్ ప్రసాద్‌కు కన్నింగ్, దేబ్జానీకి సేఫ్ ప్లేయర్, ఝాన్సీకి బ్యాక్ స్టాబర్, షాలినీకి విక్టిమ్ కార్డ్ అనే ట్యాగులను వైల్డ్ కార్డ్ టీమ్ ఎంపిక చేసింది. దీంతో ఈ టాస్క్‌లో ఎవరెవరు సరైన అంచనాలు వేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. వైల్డ్ కార్డ్స్ ఇచ్చిన ట్యాగులు, ఓజీ కంటెస్టెంట్ల అంచనాలతో టాస్క్ ప్రారంభమైంది. మొదటి బజర్‌లో సుధీర్, వంశీ పోటీపడ్డారు. ఈ రౌండ్‌లో సుధీర్ ముందుగా రియాక్ట్ అయినప్పటికీ, అతను ఎంచుకున్న సమాధానం తప్పు కావడంతో పాయింట్ దక్కలేదు. మరోవైపు ఝాన్సీకి బ్యాక్ స్టాబర్ ట్యాగ్ ఇచ్చినట్లు శివ్ వెల్లడించాడు.ఇక త్రిగుణ్‌కు 'మానిప్యులేటర్' అనే ట్యాగ్ ఇచ్చారని వంశీ కరెక్ట్‌గా గుర్తించి తన టీమ్‌కు పాయింట్ సాధించిపెట్టాడు. అలాగే షాలినీకి 'విక్టిమ్ కార్డ్' అనే ట్యాగ్ ఇచ్చిన విషయాన్ని రామ్ ప్రసాద్ కూడా సరిగ్గా అంచనా వేశాడు. ఇలా టాస్క్ సాగుతున్న కొద్దీ కంటెస్టెంట్ల మధ్య ఉన్న అభిప్రాయాలు బయటపడటంతో హౌస్‌లో ఆసక్తి పెరిగింది.ఈ టాస్క్‌లో షాలినీకి 'విక్టిమ్ కార్డ్' అనే ట్యాగ్ ఇవ్వడంపై శివ్ తన అభిప్రాయాన్ని వినిపించాడు. నీతూ విషయంలో షాలినీ అతిగా స్పందించిందని తనకు అనిపించిందని చెప్పాడు.

## 'ఫౌజీ' హీరోయిన్ బర్త్ డే.. రుచికరమైన వంటకాలతో ప్రభాస్ సర్‌ప్రైజ్..



పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ మంచి భోజన ప్రియుడన్న సంగతి అందరికి తెలిసిందే. ఆయన తినడమే కాదు, ఆయనతో పాటుగా ఉండేవారికి కూడా రుచికరమైన వంటకాలు అందిస్తుంటారు డార్లింగ్. ముఖ్యంగా ఆయనతో పని చేసే నటీనటులకు ఇంటి నుంచి మంచి రుచికరమైన భోజనం తినిపిస్తారు. ఒకటి కాదు.. రెండు కాదు.. లెక్కలేనన్నీ వెరైటీలతో నాన్ వెజ్ వంటకాలు, స్వీట్స్.. ఇలా ఎన్నో రకాల ఫుడ్ ఐటమ్స్ సెట్ కు తీసుకొచ్చి మరీ అందరికీ తినిపిస్తుంటారు. అందుకే ప్రభాస్ ఆతిథ్యం గురించి సినిమా ఇండస్ట్రీలో ఎంతో గొప్పగా చెప్పుకుంటారు. బాలీవుడ్, కోలీవుడ్, శాండల్ వుడ్, మాలీవుడ్.. ఇలా అన్ని రకాల ఇండస్ట్రీల హీరోలు, హీరయిన్లు, యాక్టర్స్ ప్రభాస్ ఆతిథ్యం రుచి చూసిన వారే. ఇప్పుడు తాజాగా తన రుచికరమైన విందుతో హీరోయిన్ ఇమాన్విని సర్ప్రైజ్ చేశారు ప్రభాస్. వివరాల్లోకి వెళితే.. క్రియేటివ్ డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న సినిమా 'ఫౌజీ'. పాన్ ఇండియా రేంజ్ లో తెరకెక్కుతోన్న ఈ సినిమాతో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ ఇమాన్వీ హీరోయిన్ గా పరిచయం అవుతోంది. మంగళవారం(అక్టోబర్ 13) ఆమె తన పుట్టినరోజును జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సినీ ప్రముఖులు, సినీ అభిమానులు, నెటిజన్లు ఇమాన్వీకి బర్త్ డే విషెస్ చెప్పారు. ఫౌజీ మేకర్స్ కూడా ఓ స్పెషల్ పోస్టర్ తో ఈ బ్యూటీకి బర్త్ డే విషెస్ చెప్పారు.ఇక ప్రభాస్ కూడా తన దైన స్టైల్ లో ఇమాన్వికి బర్త్ డే ట్రీట్ అందించారు. ఆమె కోసం తన ఇంటి నుంచి రకరకాల వెరైటీ వంటకాలు పంపించారు. ఈ విషయాన్ని ఇమాన్వి సోషల్ మీడియాలో పంచుకుంది. 'మనసు, కడుపు రెండూ ఎప్పటికీ నిండుగానే ఉంటాయి. థ్యాంక్యూ ప్రభాస్ గారు' అని ప్రభాస్ కు స్పెషల్ గా థ్యాంక్స్ చెప్పింది ఇమాన్వీ. ఇదే సందర్భంగా ప్రభాస్ పంపిన వంటకాలకు సంబంధించిన ఫొటో, వీడియోని అభిమానులతో పంచుకుందీ అందాల తార. టేబుల్ పై ఉన్న ఫుడ్ వెరైటీలన్నీ అందులో చూపించింది. ప్రస్తుతం ఇమాన్వీ షేర్ చేసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.



## మూడేళ్లు ఆ డైరెక్టర్ ఇంటి చుట్టూ తిరిగా.. నెలకు రూ.50 వేల జాబ్ కూడా వదిలేసా..

సినిమా రంగంలో సక్సెస్ సాధించిన ప్రతి దర్శకుడి వెనుకా ఒక ఆసక్తికరమైన ప్రయాణం ఉంటుంది. తెరపై కనిపించే పేరు, క్రేజ్ రావడానికి ముందు ఎన్నో అవమానాలు, ఎదురుచూపులు, రిజెక్షన్స్ ఎదుర్కొన్నవాళ్లు చాలామందే ఉన్నారు. అలాంటి కష్టాల నుంచి దర్శకుడిగా ఎదిగిన వారిలో శ్రీకాంత్ ఓదెల ఒకరు. దసరా, ది ప్యారడైజ్ వంటి చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టిన రోజులను తాజాగా ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. శ్రీకాంత్ ఓదెలకు చిన్నప్పటి నుంచే సినిమా అంటే ఆసక్తి. అయితే దర్శకుడిగా మారాలనే లక్ష్యంతో ఆయన వేసిన తొలి అడుగులు అంత సులభంగా సాగలేదు. ముఖ్యంగా తనకు ఎంతో ఇష్టమైన దర్శకుడు సుకుమార్ దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేయాలనే కోరికను నెరవేర్చుకోవడానికి చాలా కాలం ప్రయత్నించారట.ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలో శేషు అనే లెక్చరర్ ద్వారా సుకుమార్‌తో పరిచయం ఏర్పడే అవకాశం లభించిందని శ్రీకాంత్ తెలిపారు. ఆ పరిచయాన్ని ఉపయోగించుకుని సుకుమార్ టీమ్‌లో చేరేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పట్లో అవకాశం దక్కలేదట. 'ఆర్య 2' తర్వాత అన్నపూర్ణ స్టూడియోలో సుకుమార్‌ను కలిసినట్లు శ్రీకాంత్ వెల్లడించారు. అప్పటి నుంచి ఆయన దగ్గర పనిచేయాలనే పట్టుదల మరింత పెరిగిందట. అవకాశం కోసం ఏకంగా మూడేళ్ల పాటు సుకుమార్ ఇంటి చుట్టూ తిరిగినట్లు చెప్పారు.రోజూ ఉదయం అపార్ట్‌మెంట్ దగ్గరకు వెళ్లి సుకుమార్‌ను



## ఆరోవారం ఓటింగ్‌లో దుమ్మురేపుతోన్న రోహిత్.. డేంజర్ జోన్‌లో ఆ ఇద్దరు..

బిగ్ బాస్ ఇంట్లో మూడో వారం కెప్టెన్సీ కంటెండర్ టాస్కులు ఆసక్తికరంగా సాగుతున్నాయి. కంటెస్టెంట్ల మధ్య పోటీ, గొడవలు, భావోద్వేగాలు ఒకవైపు కొనసాగుతుండగా.. మరోవైపు ఇంటి సభ్యుల ఆటతీరుపై బయట ప్రేక్షకుల్లో ఉన్న అభిప్రాయాలను బిగ్ బాస్ స్క్రీన్‌పై చూపించడం హాట్ టాపిక్‌గా మారింది. ముఖ్యంగా షాలినీ, రాం ప్రసాద్, త్రిగుణ్, వర్షిణి, సుధీర్‌లపై వచ్చిన కామెంట్లు ఇంట్లో చర్చకు దారితీశాయి. కెప్టెన్సీ కంటెండర్ టాస్కుల్లో భాగంగా రెండు బజర్‌లను ముందుగా ఎవరు టచ్ చేశారనే దానిపై నరేష్, వంశీ మధ్య వివాదం తలెత్తింది. ఈ విషయాన్ని తేల్చే బాధ్యత త్రిగుణ్‌పై పడింది. మొదట నరేష్ ముందుగా బజర్ పట్టుకున్నాడని చెప్పిన త్రిగుణ్.. ఆ తర్వాత తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. చివరకు వంశీనే ముందుగా బజర్ టచ్ చేశాడని ప్రకటించాడు. ఒకవేళ తన నిర్ణయం తప్పయితే దానికి తానే బాధ్యత వహించి పనిష్మెంట్ తీసుకుంటానని త్రిగుణ్ చెప్పడం ఆసక్తికరంగా మారింది.

మరో టాస్క్‌లో వంశీ, ఝాన్సీ పోటీ పడగా.. ఝాన్సీ విజయం సాధించింది. దీంతో ఆమెకు కెప్టెన్సీ కంటెండర్‌గా నిలిచే అవకాశం రావడంతో పాటు ఫ్యామిలీ ఫోటోను పొందే ఛాన్స్ కూడా దక్కింది. అయితే తనకు లభించిన ఆప్షన్స్‌లో నరేష్‌కు సంబంధించిన లెటర్‌ను ఎంచుకున్న ఝాన్సీ.. దాన్ని ముక్కలు చేయడంతో నరేష్‌కు టెన్షన్ మొదలైంది. తర్వాత కంటెస్టెంట్లకు కాస్త రిలీఫ్ ఇచ్చేలా గార్డెన్ ఏరియాలోకి బిగ్ బాస్ భారీగా ఫుడ్ పంపించాడు. ఇంటి సభ్యులంతా కలిసి ఫుడ్‌ను ఎంజాయ్ చేశారు. కానీ ఆ ఆనందం

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224